ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 29.0
కనిష్ఠం : 25.0

33.65 ఎకరాల దేవదాయ భూమి స్వాధీనం

■ లోపలి పేజీలో..

నిబంధనల మేరకు అదనపు పోలింగ్ స్టేషన్లు : కలెక్టర్



ఏలూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పోలింగ్ స్టేషన్ల మార్పు, అదనపు పోలింగ్ స్టేషన్ల ఏర్పాట్లపై అందిన విజ్ఞప్తులను పరిశీలించి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాలమార్పు తదితర అంశాలపై వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న భవనాలు, ఇతరత్రా కారణాలతో పోలింగ్ స్టేషన్ల మార్పు కోసం 16, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు 123 ప్రతిపాదనలు అందాయని, వీటిని పరిశీలించి ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మొత్తం 1,744 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ఓటర్ల జాబితా సవరణ, ఇతర అంశాలపై నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే రాజకీయపక్షాల సమావేశాలకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు హాజరుకావడం లేదని రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలుపగా కలెక్టర్ స్పందించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు హాజరయ్యేలా ఆదేశాలలు జారీ చేయాలని డీఆర్వో విశ్వేశ్వరరావును ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిరంతరంగా జరిగే ప్రక్రియ అన్నారు. జిల్లాలో మొత్తం 16లక్షల 39వేల197 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలకు ఫారం-6 కింద 2,988 దరఖాస్తులు అందగా 2,231 పరిష్కరించామని, నిబంధనల మేరకు లేని 512 తిరస్కరించామన్నారు. ఫారం-7 దరఖాస్తులు 2,737 రాగా 1,831 పరిష్కరించి 710 దరఖాస్తులను తిరస్కరించామన్నారు. ఫారం- 8 కింద 10,615 దరఖాస్తులు రాగా అందులో 9,572 పరిష్కరించామని, 649 దరఖాస్తులను తిరస్కరించినట్టు వివరించారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, రాజకీయ పక్షాల ప్రతినిధులు ఎస్.అచ్యుత్‌బాబు, నెరుసు నెలరాజు, వి.స్టాన్లీబాబు, ఎస్.భారతరావు, ఎస్‌బీ ప్రసాద్, యు.బాలానందం, ఎం.ఫణి, టి.రామచందు, పి.ఆదిశేషు, కర్రి రామచందు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ చెల్లన్నదొర పాల్గొన్నారు.

ఊరట

ఎల్పీఎంల ఫీజు రాయితీ గడువు పొడిగింపు

ఏలూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రీసర్వే జరిగిన గ్రామాలలో సంక్లిష్టంగా మారిన జాయింట్ ఎల్పీఎంల సమస్య పరిష్కారానికి గతంలో ఫీజు చెల్లింపు తగ్గించడం కోసం డిసెంబరు నెలాఖరు వరకు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇటు రైతులు, అటు సర్వే అధికారులకు పెద్ద ఊరట లభించినట్లయింది. ఒక్కో జాయింట్ ఎల్పీఎంను విడగొట్టి జిల్లాలోని 542 రెవెన్యూ గ్రామాలకు మొదటి విడతలో వైసీపీ ప్రభుత్వంలో 138 రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తయింది. గతంలో ఈ జాయింట్ ఎల్పీఎంలు విడగొట్టే ప్రయత్నాలు జరిగినా ఎక్కడా సానుకూలత జరగలేదు. మొత్తం మీద ఈ 138 గ్రామాలకు సంబంధించి రీసర్వే పూర్తికాగా అందులో మొత్తం 25 వేలకు పైగా జాయింట్ ఎల్పీఎంలు తేలాలి. ఇవి కాకుండా జిల్లాలో ఇంకా సగానికి సగం గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాల్సి ఉంది. వీటిని పరిష్కరించాలని కోరుతూ గతంలో జరిగిన గ్రామసభల్లో రైతులు అర్జీలు సమర్పించారు. ఒక్కో జాయింట్ ఎల్పీఎం విడగొట్టాలంటే రూ.550 ప్రభుత్వానికి ఫీజు సమర్పించారు. కొంతమంది రైతులకు ఐదు నుంచి ఆరు జాయింట్ ఎల్పీఎంలు ఉండడంతో వాటికి ఫీజు చెల్లించడం రైతులకు తలకు మించిన భారమైంది. తప్పు చేసింది ప్రభుత్వం.. దానికి ఇంత మొత్తం ఫీజు తామెందుకు చెల్లించాలనే వాదనలు రైతుల నుంచి బలంగానే వినిపించాయి. సమస్యను పరిశీలించిన టీడీపీ ప్రభుత్వం రైతులు చెల్లించాల్సిన ఫీజు విషయంలో భారీగా వెసులుబాటు కల్పించింది. ఒక్కో ఎల్పీఎం విడగొట్టడానికి రూ.550కి బదులుగా రూ.50 చెల్లిస్తే చాలని జనవరి 1న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ వెసులుబాటును ఆరు నెలలు మాత్రమే ప్రభుత్వం కల్పించింది. ఒక వైపు రీసర్వే, మరొకవైపు ఎల్పీఎంల సబ్ డివిజన్ సాధ్యం కాక సర్వేయర్లు సతమతమయ్యారు. సమస్యను గమనించిన ప్రభుత్వం సబ్ డివిజన్ ఫీజు రాయితీ గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ తాజా ఉత్తర్వులు ఇచ్చింది.

మహర్దశ

జిల్లాలోని ఏలూరు నగరంతో పాటు పట్టణాలకు మహర్దశ పట్టనుంది. నగర, పట్టణ ప్రజలను ఎంతో కాలంగా పట్టిపీడిస్తున్న తాగునీటి సమస్య, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు మోక్షం కలగనుంది. అమృత్ 2.0 పథకంలో భాగంగా జిల్లాలోని ఏలూరు నగర పాలక సంస్థ, చింతలపూడి, నూజివీడు, జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలకు రూ.464.28 కోట్లు మంజూరయ్యాయి. నగర,పట్టణాల ప్రజల తాగునీటి అవసరాలు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపరచడానికి ఈ నిధులు కేటాయించారు.





జిల్లాకు అమృత్ నిధులు

- ఏలూరు నగరం, మునిసిపాలిటీల్లో తీరనున్న తాగునీరు, అండర్‌గ్రౌండ్ సమస్య
- రూ.464 కోట్లతో పథకం కింద పనులు

ఏలూరుటూటౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 పథకంలో భాగంగా జిల్లాకు నిధులు కేటాయించారు. ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సరపరాకు 143.13 కోట్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.148.44 కోట్లు, తాగునీటి సరఫరా కోసం చింతలపూడి పట్టణానికి రూ.57.68 కోట్లు, నూజివీడు మునిసిపాలిటీకి రూ.13.87 కోట్లు, జంగారెడ్డి గూడేంకు రూ.101.16 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి అధికారులు నివేదికలు పంపారు. ప్రభుత్వం వాటికి అనుమతులు మంజూరు చేసింది. ప్రస్తుతం ఇవి టెండర్ల దశలో ఉన్నాయి. టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే పనులు మొదలుపెట్టే అవకాశం ఉంది. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో అమృత్ నిధుల గురించి పట్టించుకోలేదు. ఈ పథకంలో 50 శాతం నిధులను కేంద్రప్రభుత్వం ఇస్తే మిగిలిన 50 శాతం నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం స్థానిక సంస్థలు, 30 శాతం భరించాల్సి ఉంటుంది. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రభుత్వం అప్పులపాలై దివాళ తీసిన నేపథ్యంలో అమృత పథకానికి 50 శాతం నిధులు వెచ్చించలేక కేంద్రం ఇచ్చే నిధులు తీసుకోకుండా పథకాన్ని నీరుగార్చారు. దీంతో నగరాలు, పట్టణాల్లో ఎక్కడ సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. ముఖ్యంగా ప్రజలకు అతిముఖ్యమైన తాగునీటి సమస్య, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు చేయలేక అనాటి వైసీపీ ప్రభుత్వం పట్టణ ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేసింది. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రాగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో అమృత్ పథకంలో జిల్లాకు రూ.464.28 కోట్లు కేటాయించేందుకు కృషి చేశారు.

- ఏలూరు నగరపాలక సంస్థ ఏడు విలీన గ్రామాలతో కలిపి తాగునీటి సరఫరాకు 143.13 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పోణంగి దగ్గర 10 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, పంపుల చెరువు దగ్గర మరో 10 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మిస్తారు. రా వాటర్ పంపింగ్ కోసం 10.10 ఎంఎల్‌డీ ఎస్‌ఎస్.ట్యాంకు నిర్మిస్తారు. రా వాటర్, క్లీయర్ వాటర్ పంపింగ్ కోసం 14 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేస్తారు. ఐదు రిజర్వాయర్లు నిర్మిస్తారు. ఇంటింటికీ తాగునీటి సరఫరా కోసం 72.87 కిలోమీటర్ల మేర భూమిలో పైపులైన్లు వేస్తారు. కొత్తగా 4,618 ఇళ్లకు కుళాయిలు ఇస్తారు. వన్‌టౌన్ ఏరియాలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంలో భాగంగా 15 ఎంఎల్‌డీ కెపాసిటీతో పోణంగిలో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తారు. 148.44 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభిస్తారు. 52 కిలోమీటర్ల మేర అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి పైపులైన్లు నిర్మిస్తారు.
- చింతలపూడికి తాగునీటి సరఫరా కోసం రూ.57.68 కోట్లు మంజూరయ్యాయి. వీటితో (మిగతా 8వ పేజీలో)

టెండర్ల దశలో ఉన్నాయి..



అమృత్ పథకంలో ఏలూరు, చింతలపూడి, నూజివీడు, జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలకు అమృత్ నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వ అనుమతులు లభించాయి. ప్రస్తుతం టెండర్ల దశలో ఉన్నాయి. టెండర్లు పూర్తవగానే కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ చేయించుకుని పనులు ప్రారంభిస్తాం.

- ఫణిభూషణ్‌రావు, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ విజయరాజు

వయోజనులందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- డీఆర్డీఏ పీడీ విజయరాజు

పెదపాడు, జూలై 26(ఆంధ్రజ్యోతి):నిరక్షరాస్యులైన వయోజనులందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉల్లాస్ అక్షరాంధ్ర అక్షరాస్యత కార్యక్రమాన్ని విజయవంతం చేయియాలని డీఆర్డీఏ పీడీ విజయరాజు తెలిపారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో పెదపాడు మండలం వట్లూరు టీటీడీసీలో జిల్లా స్థాయి శిక్షణ శనివారం నిర్వహించారు. జిల్లాలో 3,44,184 మంది వయోజనులైన నిరక్షరాస్యులను గుర్తించగా మొదటి విడతగా ఈ ఏడాది 97,200 మందిని అక్షరాస్యులుగా చేయడానికి సంబంధిత శాఖల ద్వారా యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. రాబోయే మూడేళ్లలో జిల్లాను అక్షరాస్యతలో మొదటి స్థానంలోకి తీసుకురావాలన్నారు. ఈనెల 30వ తేదీన మండలాల్లో వలంటరీ టీచర్స్‌ని గుర్తించి, పదిమందికి ఒక వలంటరీ టీచర్‌ని ఏర్పాటు చేసి, ఆగస్టు 7వ తేదీ నుంచి 2026 ఫిబ్రవరి 20వ తేదీ వరకు 100 గంటల తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. కోఆర్డినేటర్లు, జిల్లా వయోజన విద్య నోడల్ అధికారి సత్యనారాయణ, జడ్పీ సీఈవో భీమేశ్వరరావు, డ్వామా ఏపీడీ రాజశేఖర్, ఏలూరు డీఎల్పీవో, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



వృద్ధురాలి ఇంటి వద్దే రేషన్‌ను అందిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ పంపిణీ పరిశీలన

ఏలూరుసిటీ/ఏలూరు జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 65 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులకు, మంచానికి పరిమితమైన వారికి రేషన్ షాపు డీలర్ ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ఏలూరులో శనివారం జేసీ ధాత్రిరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 76,193 మంది 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, మంచానికి పరిమితమైన రేషన్ కార్డుదారులు ఉన్నారని, వీరికి ప్రతి నెలా 26వ తేదీ నుంచి ఆ నెల చివరి నాటికి డీలర్లు వారి ఇంటికి వెళ్లి రేషన్ సరుకులను అందిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో ఈనెల ఇప్పటివరకు 15,154 మంది కార్డుదారులకు (19.89 శాతం) రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేశారన్నారు. డీఎస్‌వో విలియమ్స్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఏలూరు నగరంలో తొలిరోజు జోరువానను సైతం లెక్క చేయకుండా డీలర్లు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి బియ్యం, పంచదారను సరఫరా చేశారు.

ఒకటి నుంచి ఆస్తి పన్నుల ఆటోమ్యుటేషన్

- కమిషనర్ భానుప్రతాప్

ఏలూరుటూటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నుల ఆటోమ్యుటేషన్ కార్యక్రమం ఆగస్టు ఒకటి నుంచి ప్రారంభిస్తున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఆస్తిపన్నులు ఆటోమ్యుటేషన్ ప్రత్యేక శిక్షణ జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రజలు వారి ఆస్తులు రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే నగర పాలక సంస్థకు చలనా చెల్లిస్తే ఆస్తిపన్ను పేరు మార్పు జరుగుతుందన్నారు. అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, సిబ్బంది, పాల్గొన్నారు.



వరహాపట్నంలో పేలుడు

- ఇద్దరికి తీవ్ర గాయాలు, ఒకరికి వినికిడి సమస్య
- పేలుడు పదార్థం లేదని తేల్చిన బాంబ్ స్క్వాడ్

■ లోపలి పేజీలో..

డయాలసిస్.. కష్టాలు తీరాయి!



కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ వైద్యసేవలు

- కైకలూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు
- ప్రతినెలా 35 మందికి వైద్యసేవలు
- రోగులకు టీడీపీ ప్రభుత్వం భరోసా

కైకలూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో అత్యధిక ప్రజలు తాగే నీరు, తినే తిండి విచ్చలవిడిగా మందులు వినియోగం వల్ల కిడ్నీ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు. ఇలా వ్యాధులకు గురైన వారు వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. కైకలూరు నియోజకవర్గంలో కిడ్నీ సంబంధిత వ్యాధులు, వారికి అందించే డయాలసిస్ కేంద్రాలు గతంలో అందుబాటులో లేక ఇబ్బందులు పడేవారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు, వైద్యాధికారులు, టెక్నీషియన్, ఇతర సిబ్బందిని నియమించడంతో పాటు అన్ని రకాల వసతులను కల్పించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చొరవతో ప్రతీ నెలా 35 మందికి డయాలసిస్ చేస్తున్నారు. మొత్తంగా నెలలో 300 సార్లు డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. రోగికి రక్తాన్ని శుద్ధి చేసి మరలా ఎక్కించడంతో వారు ఆరోగ్యవంతంగా ఉంటారు. రోగి వ్యాధి తీవ్రతను బట్టి వారికి రక్తాన్ని శుద్ధి చేయాల్సి ఉంటుంది. గతంలో ఇలా డయాలసిస్ కేంద్రం అందుబాటులో లేక రోగులంతా ఏలూరు, విజయవాడ, భీమవరం, మచిలీపట్నం, తదితర ప్రాంతాలకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసి ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందేవారు. ఎప్పటి నుంచో కైకలూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉండడం, అందుకు ప్రభుత్వం చేయూతనివ్వడంతో స్థానికంగానే ఈ వైద్య సేవలు అందుతున్నాయి.

ప్రతీరోజూ రెండు బ్యాచ్‌లుగా..

ప్రతీరోజూ రెండు బ్యాచ్‌లుగా పది మంది కిడ్నీ బాధితులకు రక్తాన్ని శుద్ధి చేసే సౌకర్యాలను కల్పించారు. స్థానికంగా ఉండే వైద్యాధికారితో పాటు పాలకొల్లు నుంచి మూత్రపిండాల వ్యాధి నిపుణులు ప్రతీ నెలా రెండు సార్లు రోగులను పరీక్షించి వారికి కావాల్సిన మందులను, రక్తాన్ని ఎన్నిసార్లు శుద్ధి చేయాలనేది నిర్ధారణ చేస్తుంటారు. ఒక్కొక్క డయాలసిస్‌కు ప్రభుత్వం రూ.1,244 ఖర్చు చేస్తోంది. ఇదే వైద్యాన్ని ప్రైవేటు ఆస్పత్రిలో పొందితే రూ.మూడు వేల నుంచి రూ.4 వేలు అయ్యేదని రోగులు పేర్కొంటున్నారు. ప్రతీరోజూ డయాలసిస్ పేషంట్లతో పాటు కైకలూరు ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగులకు శ్రీసత్యసాయి సేవాసమితి ఉచితంగా భోజన సదుపాయాన్ని కల్పిస్తున్నారు. మరోవైపు అర్హత కలిగిన (మిగతా 8వ పేజీలో)

ప్రయాణభారం, వైద్య ఖర్చులు తగ్గాయి



ఎన్నో ఏళ్లగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వారానికి రెండుసార్లు విజయవాడకి వెళ్లి డయాలసిస్ చేయించుకునే వాడిని. కైకలూరులో ఏర్పాటు చేయడంతో ప్రయాణభారం తగ్గడంతో పాటు సొమ్ము ఆదా అవుతోంది. మానసిక ఒత్తిడి లేకుండా ఉంటున్నాం. విజయవాడ వెళితే అర్థరాత్రికి తిరిగివచ్చేవాళ్లం. టీడీపీ ప్రభుత్వం కైకలూరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంది.

- పరసా వెంకయ్య, అయ్యవారిరుద్రవరం, మండవల్లి మండలం

గోదావరీ..



నీటమునిగిన గుండేటివాగు కాజ్‌వే

- నీటమునిగిన గుండేటివాగు కాజ్‌వే.. ఎద్దువాగు వంతెన
- వేలేరుపాడు మండలంలో 15 గ్రామాలకు నిలిచిన రాకపోకలు



వరదలో మునిగిన ఎద్దువాగు వంతెన

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. భద్రాచలం వద్ద శనివారం ఉదయం 31.30 అడుగుల నీటిమట్టం ఉండగా సాయంత్రానికి 36 అడుగులకు చేరుకోగా సుమారు ఆరు లక్షల క్యూసెక్కుల వరదనీరు దిగువకు వస్తోంది. కుక్కునూరు, దాచారం గ్రామాల మధ్య ఉన్న గుండేటివాగు కాజ్‌వే నీటమునగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వయా నల్లకుంట మీదుగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రమేశ్‌బాబు సూచించారు. జాలర్లు చేపలవేటకు వెళ్లవద్దని, ప్రజలు స్నానాలకు వెళ్లవద్దని, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలవరం వ్యాక్‌వాటర్ కారణంగా వేలేరుపాడు మండలంలోని చీరవల్లి సమీపంలో ఎద్దువాగు వంతెన నీటమునగటంతో కోయిదాతో పాటు పరిసర 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులే నాటు పడవను ఏర్పాటు చేసుకుని అత్యవసర పనులకు మండ ల కేంద్రానికి వస్తున్నారు. గత పది నెలల్లో ఎద్దువాగు వంతెన నీట మునగడం ఇది రెండోసారి. పోలవరం వద్ద గోదావరి ఉరకలు వేస్తోంది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఆక్రమించాయి. పట్టిసీమ ఫెర్రీ రేవులో సచివా లయ భవనం వద్ద గట్టు క్రమక్రమంగా కోతకు గురవుతోంది.



వరద జలాల మధ్య పోలవరం స్పిల్‌వే

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటిం ది. అయినా దాని ప్రభావంతో శనివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. పలు ప్రాంతాలలో మబ్బుల వాతావరణమే కనిపించింది. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా వేలేరుపాడు మండలంలో 72.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా వేలేరుపాడు మండలంలో 72.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 22.2 మి.మీగా నమోదైంది. కుక్కునూరు 56, పెదవేగి 32.4, బుట్టాయిగూడెం 30.2, ఏలూరు అర్బన్ 29.4, ఆగిరిపల్లి 27.4, కొయ్యలగూడెం 24.8, మండవల్లి 23.8, దెందులూరు 23.6, నిడమర్రు 22.2, టి.నరసాపురం 22, ఏలూరు రూరల్ 21.2, ముదినేపల్లి 20.6, జంగారెడ్డి గూడెం 19.6, జీలుగుమిల్లి 19.6, కామవరపుకోట 19.4, కలిదిండి 18.4, పెదపాడు 17.4, కైకలూరు 16.4, చింతలపూడి 16, ఉంగుటూరు 15.2, ద్వారకాతిరుమల 12.2, పోలవరం 12, నూజివీడు 11.2, భీమడోలు 10.6, ముసునూరు 9.6, చాట్రాయి 9.6, లింగపాలెం 8.6 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

ఎస్పీకి అరుదైన అవకాశం

గూగుల్ ఇండియా హ్యాకథాన్‌లో ముఖ్య ఉపన్యాసం

ప్రపంచ వ్యాప్తంగా పాల్గొన్న 2,300 మంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శాస్త్రవేత్తలు



వీడియోకాన్ఫరెన్సు ద్వారా సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏజెంట్లపై గూగుల్ ఇండియా ప్రపంచంలోనే అతిపెద్ద హ్యాక్‌థాన్ కార్యక్రమాన్ని శనివారం వీడియో కాన్ఫరెన్సు ద్వారా నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమంలో 2,300 మంది డెవలపర్లు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ శాస్త్రవేత్తలు) ఉత్సాహంగా ఒకే వేదికపై పాల్గొన్నారు. అయితే ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ఈ కార్యక్రమంలో భారతదేశం నుంచి పాల్గొన వారిలో జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిశోర్‌కు అరుదైన అవకాశం దక్కింది. కాన్ఫరెన్స్‌లో ఎస్పీ ముఖ్య ఉపన్యాసం ఇస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచ వ్యాప్తంగా మానవ విజ్ఞానానికి ఏ విధంగా పరిష్కార మార్గాలు కల్పిస్తుందో వివరించారు. ముఖ్యంగా చట్టాల అమలు, ఆరోగ్య సంరక్షణ, పాలన, ప్రజా వ్యవస్థలో ఎస్పీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ద్వారా అమలు చేస్తున్న విధానాన్ని వివరించారు. రాష్ట్రంలోనే పోలీస్‌శాఖలో ఏలూరు జిల్లా మార్గదర్శకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో నిలిచిందని, ఫస్ట్ ఇన్వెస్టిగేషన్ రిపోర్టు ఏ విధంగా సేకరించాలి, తదనుగుణంగా కేసుల దర్యాప్తులో ఎలా వ్యవహరించాలో అధికారులకు ఆర్టిఫిషియల్స్ ఇంటెలిజెన్స్‌లో క్రియాశీలకమైన పాత్ర పోషిస్తోందన్నారు. ద్విభాషా పద్ధతిలో డేటా ఉండడం, డేటాను భద్రపర్చడం, వాయిస్ ద్వారా డాక్యుమెంటేషన్ తయారు చేసుకోవడం జరుగుతోందన్నారు. ఎస్పీ ప్రసంగం కార్యక్రమంలో పాల్గొన్న అందరిని ఆకట్టుకోంది. ప్రజలకు ఉత్తమ సేవలు అందించడానికి పౌరుల గోప్యతను కాపాడుతూ, సమర్థవంతమైన సేవలను భారత దేశంలోనే మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిష్కార మార్గంగా నిలుస్తూ పోలీస్ రంగంలో వినియోగిస్తున్న తీరును ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ గూగుల్ ఇండియా ఎస్పీ కిశోర్‌ను అభినందించింది. ఎస్పీ కిశోర్ విధి నిర్వహణలో ఒక్క క్షణం తీరిక లేకుండా విధులను నిర్వర్తిస్తూనే మరోవైపు ప్రజలకు మెరుగైన సేవలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానంలో అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయనే స్వయంగా ఇంట్లో డీకోడింగ్ చేసుకుని యాప్‌లను తయారు చేసి ఏలూరు జిల్లా పోలీస్‌శాఖలో ఏఐ టెక్నాలజీ ప్రవేశపెట్టి సేవలు అందిస్తున్నారు.

గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజుకు మంత్రి వర్మ సత్కారం

భీమవరంటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : గోవా రాష్ట్ర నూతన గవర్నర్‌గా పూసపాటి అశోక్ గజపతిరాజు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పాల్గొన్నారు. శనివారం ఉదయం గోవా రాజ్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన అశోక్ గజపతిరాజును వర్మ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



33.65 ఎకరాల దేవదాయ భూమి స్వాధీనం

జంగారెడ్డిగూడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం సుబ్బంపేటలోని సీతారామ స్వామి దేవస్థానానికి చెందిన 33.65 ఎకరాల భూమిని ఎండోమెంట్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకుని ఆ భూమిలో ఉన్న పామాయిల్ చెట్లను జేసీబీతో తొలగించారు. సుమారు నలభై ఏళ్లుగా ఆలయానికి చెందిన భూమి ఆక్రమణలో ఉండగా ఆ భూమిపై హక్కులు తమకే చెందుతాయని 2006లో భూమి ఆక్రమణ దారులు కోర్టుకు వెళ్ళగా హైకోర్టు వారి ఫిర్యాదును డిస్పోజ్ చేసినట్లు గోకుల తిరుమల పారిజాతగిరి దేవస్థాన ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. దీంతో దేవదాయ శాఖ నూతన చట్ట ప్రకారం భూమిని స్వాధీన పరుచుకున్నామని తెలిపారు. ఇళ్ల నిర్మించుకున్న వారిని తొలగించాలని సూచించినట్లు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న భూమి

ఇంటి స్థలాలు ఇచ్చేందుకు సహకరిస్తా : ఎమ్మెల్యే రోషన్‌కుమార్

దేవస్థాన భూమిలో నలభై ఏళ్ళుగా ఇళ్ల నిర్మించుకుని నివాసం ఉంటున్న పేదలందరికీ ప్రత్యామ్నాయంగా ఇళ్లస్థలాలు, ఇళ్ళు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం పూర్తిగా సహ కరిస్తుందని చింత లపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ను ఆలయ భూమిలో ఇళ్ల నిర్మించుకుని నివసిస్తున్న పేదలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన అధికారులతో మాట్లాడారు.వెంటనే ఖాళీ చేయాలంటే పేదలు ఇబ్బందులు పడతారని, నెల రోజులు సమయం ఇవ్వాలని సూచించారు.



వినతిపత్రం ఇస్తున్న సుబ్బంపేట పేదలు

కాలినడక మార్గంలో విద్యుత్ దీపాల ఏర్పాటుకు రూ.4.23 లక్షలు అందజేత

భీమవరంటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ద్వారక తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కాలినడక వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు జిల్లా రైస్ మిలర్ల్స్ అసోసియేషన్ తరుపున 4 లక్షల 23 వేల రూపాయలను అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు దేవస్థానం అధికారులకు అందించారు. కాలినడకన రాత్రి సమయంలో భక్తులు ఇబ్బందులు పడటంతో పాటు ఇటీవల ఒక భక్తుడు పాము కాటుకు గురయ్యాడని తెలవడంతో మిల్లర్స్ అసోసియేషన్ సామాజిక సేవా సంస్థ నుంచి అందించారు.



ప్రభుత్వ భవనానికి రక్షణ కరువు..!

బొండాడలో సచివాలయం వద్ద నిర్మించిన బాత్‌రూమ్స్ కూల్చివేత

కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

కాళ్ళ, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : లక్షలాది రూపాయలతో నిర్మించిన ప్రభుత్వ భవనానికి రక్షణ కరువైంది. ప్రైవేట్ వ్యక్తులు కూల్చివేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కాళ్ళ మండలం బొండాడ గ్రామంలో నెలకొన్న ఈ పరిస్థితి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే గత ప్రభుత్వ హయాంలో బొండాడ గ్రామంలో నూతన సచివాలయ భవనం నిర్మించారు. దానిని ఆనుకుని సీఎస్‌సీ బిల్డింగ్ (కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్) నిధులు రూ. 3 లక్షలతో పురుషులు, స్త్రీలకు విడివిడిగా రెండు బాత్‌రూమ్స్ నిర్మాణం పూర్తి చేసి పంచాయతీకి అప్పగించారు. అయితే సమీపంలోని ఒక వ్యక్తి ఇటీవల వాటిని కూల్చివేసి అసలు అక్కడ ఆనవాళ్ళు లేకుండా చేశాడు. సచివాలయ భవనం ప్రారంభం కాకుండానే ఇలా లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన కట్టడం కూల్చివేయడంపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇటీవల దీనిపై గ్రామ ఉప సర్పంచ్ పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీనిపై ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజుకు ఫిర్యాదు చేస్తామని పలువురు గ్రామస్తులు తెలుపుతున్నారు. దీనిపై కాళ్ళ డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావును వివరణ కోరగా సదరు భవనం విషయం తన దృష్టికి వచ్చిందని, క్షేత్రస్థాయిలో పరిశీలించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



ప్రభుత్వ నిధులతో నిర్మించిన బాత్‌రూమ్‌లను కూల్చివేసిన దృశ్యం

విర్డ్ ఆసుపత్రిలో దివ్యాంగులకు కాలిపర్స్ అందజేత

ద్వారకాతిరుమల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): విర్డ్ ఆసుపత్రిలో గురు, శుక్రవారాల్లో హ్యాండ్, పెడియాట్రిక్ క్యాంపు నిర్వహించినట్లు ఆసుపత్రి చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు శనివారం విలేకర్లకు తెలిపారు. ఇందులో భాగంగా డాక్టర్ భాస్కరానంద్ 20 మంది రోగులను పరీక్షించారు. అందులో పదిమందికి శస్త్రచికిత్సలు అవసరమని సిఫార్సు చేశారు. అనంతరం 14 మంది దివ్యాంగులకు గుప్తా ఫౌండేషన్ చైర్మన్ ఎంఎం గుప్తా సహకారంతో తయారైన కాలిపర్స్, కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఆసుపత్రి ట్రస్టీలు ఐవీఆర్ సుధాకర రావు, నారాయణమూర్తి, వైద్యులు, భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, కె.శ్రీనివాస్, వీవీ నాగేంద్ర బాబు, సింధు, గాయత్రి, విజయ్ కిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కృత్రిమ అవయవాలను అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు, వైద్యులు

సరికొత్తగా చిన్నారుల బడి

అంగన్‌వాడీ కేంద్రాల్లో స్మార్ట్ టీవీలు

లింగపాలెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యనందించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గత వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను పట్టించుకోక పోవడం, నిధులను సమకూర్చకపోవడంతో పాటు చిన్నారులకు కల్పించాల్సిన మౌలిక సౌకర్యాలను గాలికి వదిలేసింది. దీంతో పాటు చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం కూడా కొందరు చోటా నాయకులు పక్కదారి పట్టించినా అడిగేవారు లేకపోవడంతో అంగన్‌వాడీలు దాదాపుగా నిరాదరణకు గురయ్యాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏలూరు జిల్లాలో ఉన్న 2,226 అంగన్‌వాడీ కేంద్రాలను సరికొత్తగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు కావలసిన మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు చిన్నారులకు ప్రాథమిక స్థాయి నుంచే సరైన బోధన కల్పించేలా ఆటపాటలతో కూడిన పాఠ్య పుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. అంతే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలను సరికొత్తగా తీర్చిదిద్ది చిన్నారులకు దృశ్య మాధ్యమంలో ప్రాథమిక విద్యనందించేందుకు జిల్లాలో ఉన్న పది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో సొంత భవనాలు ఉన్న 974 అంగన్ వాడీ కేంద్రాలలో స్మార్ట్‌టీవీలను అమర్చేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే 855 అంగన్‌వాడీ కేంద్రాలలో స్మార్ట్‌టీవీలను అమర్చినట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. ఈ స్మార్ట్ టీవీల ద్వారా ప్రత్యేకంగా రూపొందించిన పాఠ్యాంశాలను టీవీ స్క్రీన్‌పై చూపిస్తూ చిన్నారులకు ప్రత్యేకంగా బోధించనున్నారు. ప్రస్తుతానికి అంగన్‌వాడీ కేంద్రాలలో ఇంటర్‌నెట్ కనెక్షన్ లేక పోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తల మొబైల్ ఫోన్ బ్లూటూత్ ద్వారా కనెక్ట్ చేసి చిన్నారులకు బోధిస్తున్నారు.



చిన్నారులకు దృశ్య మాధ్యమం ద్వారా బోధిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

వధువు కావలెను..

అన్ని కులాల్లో పెళ్లి కూతుళ్ల కొరత

పెళ్లి కాని యువకుల్లో అలజడి

శ్రావణమాసం నేపథ్యంలో పెళ్లి కుమారుల వెతుకులాట



గణపవరానికి చెందిన ఒక యువకుడు ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు.. నెలకు రూ.30 వేలు దాక సంపాదిస్తున్నాడు. మొన్నటి వరకు తనకు తగిన అమ్మాయి కోసం వెతకని చోటులేదు.. తిరగని ఊరు..ప్రాంతం లేదు. ఇప్పుడు అతని వయసు 30కి చేరింది.. ఇకలాభం లేదనుకుని మంచి అమ్మాయి అయితే చాలు అనే పరిస్థితికి వచ్చాడు.

అన్నీ ఉన్నా అతనికి పెళ్లి ఘడియ మాత్రం రావడం లేదు.. తాడేపల్లిగూడేనికి చెందిన యువకుడికి మంచి ఉద్యోగం..ఆస్తి పాస్తులు బాగానే ఉన్నాయి.. కానీ వారి సామాజిక వర్గంలో అమ్మాయిల కొరత తీవ్రంగా వేదిస్తోంది..కట్నం ఆశించకుండా పెళ్లికి రెడీ అయినా ఎక్కడా వధువు జాడ కనిపించడం లేదు..ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు.

-గణపవరం (ఆంధ్రజ్యోతి)

వధువు కావలెను.. ప్రస్తుతం ఎక్కడ విన్నా ఇదే మాట. ఏ వివాహ వేదిక చూసినా ఇలాంటి ప్రకటనలే కనిపిస్తున్నాయి. శ్రావణమాసం వచ్చేసింది. వివాహాది శుభ కార్యాలకు శ్రావణ మాసం చాలా అనుకూలమైనది. ఈ నెల 26 నుంచి నవంబర్ 27 వరకు శుభముహర్తాలు ఉన్నాయి. దీంతో వధువు కోసం ఆయా సామాజిక వర్గాలకు చెందిన పెళ్లి కుమారుల కుటుంబ సభ్యులు వెతుకులాట మొదలు పెట్టారు. ఇప్పుడు అన్ని సామాజిక వర్గాల్లోనూ పెళ్లికూతుళ్ల కొరత తీవ్రంగా వేదిస్తున్నది. అమ్మాయిల కోసం పక్క జిల్లాలు, రాష్ట్రాలు చుట్టి రావల్సిన పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో పలువురు యువకులు కట్న కానుకలు లేకుండా పెళ్లిళ్లకు సిద్ధమవుతుండగా మరికొందరు కన్యాశుల్కంతో ముందు కొస్తుండడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.



పెళ్లి కూతుళ్ల కొరత

భ్రూణ హత్యలతో ఆడపిల్లల జనాభా నానాటికి తగ్గుతోంది. ఫలితంగా రానున్న రోజుల్లో యువకులు పెళ్లి చేసుకునేందుకు యువతులే లేకుండా పోవచ్చు. కొంతకాలంగా స్వచ్ఛంధ సంస్థలు పెళ్లిళ్ల బ్యూరోలు ప్రచార మాధ్యమాల్లోనూ, సామాజికవేత్తల ఆందోళన ఇది. నిజానికి ఇది సత్యదూరమేమీ కాదు. ఇప్పటికే చాలా కులాల్లో పెళ్లి కూతుర్ల కొరత అధికమైంది. వయసు వచ్చిన కుమారులకు పెళ్లి చేయడానికి తల్లిదండ్రులు కాలికి బలపం కట్టుకుని తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

కారణాలు అనేకం..

ఒకప్పుడు బాల్య వివాహాలు అధికంగా ఉండేవి. తరువాత వరుడుకు 21, వధువుకు 18 ఏళ్ల నిండాకే వివాహం చేయాలన్న చట్టం మనదేశంలో వచ్చింది. ఇప్పుడు చదువు, ఉద్యోగ వేటలో పడి 25 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసు వచ్చేవరకు ఎవరూ పెళ్లి చేసుకోవడం లేదు. ఉన్నత విద్యావంతులు వివిధ ఉద్యోగాల్లో స్థిరపడినవారు తమ లాంటి స్థాయి ఉన్నవారినే కోరుకుంటారు. సాఫ్ట్‌వేర్ రంగం, డాక్టర్లుకు అదే వృత్తిలో ఉన్నవారే కావాలనుకుంటుండటంతో సహజంగానే వధువుల కొరత తీవ్రమవుతుంది. ఇలాంటి అర్హతలు ఉన్న వధూవరుల కోసం రాష్ట్రాలు, ఇతర జిల్లాలతో సైతం తిరుగుతున్నారు. స్థాయిని కోరుకునేవారు మాత్రం కులాల పట్టింపులు పక్కన పెట్టడం గమనార్హం. వధువుల కొరతతో ఎదురు కట్నాలు, కులం పట్టింపులు సడలిపోవడం వంటి పరిణామాలు భవిష్యత్తులో కన్యాశుల్కానికి దారితీసే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పండితులు, పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

తగ్గిపోతున్న ఆడపిల్లల సంఖ్య

నాలుగున్నర దశాబ్దాల వెనక్కి వెళ్తే పెళ్లి కుదుర్చుకోవాలంటే కులం, గోత్రమే కాదు..అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాల చరిత్ర చూసేవారు.. మన ముందు తరాలు చెప్పిన దాన్నిబట్టి అప్పట్లో కట్నాకానుకలు సమర్పించి కన్యాదానం చేసేవారు. ప్రస్తుతం ఈ పరిస్థితులు మారుతున్నాయి. టెక్నాలజీ పెరిగింది. జీవనశైలి మారింది. గడిచిన కొన్నేళ్లుగా చాలా కులాల్లో ఆడపిల్లల సంఖ్య దారుణంగా పడిపోయింది. ఒకరిద్దరితోనే కుటుంబ నియంత్రణలు పాటిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా ఇది కొనసాగుతుండటంతో ఆడపిల్లలు లేని దుస్థితి నెలకొంది.

కట్న,కానుకలు లేకపోయినా సరే..

ఒక అగ్రకులానికి చెందిన యువకుడు కట్నం లేకపోయిన పర్వాలేదు..అనుకున్నా అమ్మాయి దొరకడం లేదు. రెండువైపులా పెళ్లిఖర్చులు తామే భరిస్తామని విస్తృతంగా పర్యటించినా ఫలితం ఉండటం లేదు. ఇలాంటి పరిస్థితి దాదాపు అన్ని కులాల్లోనూ వచ్చేసింది. తమకు అనుబంధంగా ఉన్న కులాల్లోనైనా పర్వాలేదు అనుకున్నప్పటికీ అమ్మాయి దొరకడం లేదు. కుటుంబ కట్టుబాట్లు, సంప్రదాయాలు గౌరవించేవాళ్లు తమ కులం అమ్మాయిల కోసం నిరీక్షిస్తుంటే కులాల పట్టింపులు అంతగాలేని వారు ఇతర కులాల అమ్మాయిలను వెతికి మరీ పెళ్లాడుతున్న పరిస్థితి ఉంది. అలాగే మరికొంతమంది కులాంతర వివాహాలకు ముందు కొస్తున్న సంఘటనలు అక్కడక్కడ కనిపిస్తున్నాయి.



త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామితో మాజీ ఎంపీ గోకరాజు,ఎమ్మెల్యే రోషన్‌కుమార్



గిరి ప్రదక్షిణ రహదారిపై పోటెత్తిన భక్తులు

గోకుల పారిజాతగిరి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ రహదారి ప్రారంభం

జంగారెడ్డిగూడెం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాత గిరి క్షేత్రంలో మాజీ రాజ్యసభ సభ్యుడు గోకరాజు గంగరాజు ఆర్థిక సహకారంతో రూ.70 లక్షలతో గిరి ప్రదక్షిణ కోసం నిర్మించిన 2.5 కిలోమీటర్ల సీసీ రోడ్డును శనివారం త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రారంభించారు. జీయర్ స్వామికి దాత గోకరాజు గంగరాజు, చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యేలు సొంగా రోషన్ కుమార్, చిర్రి బాలరాజు, ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. నూతనంగా ప్రారంభించిన గిరి ప్రదక్షిణ దారిలో వందలాది మంది భక్తులు ప్రదక్షిణ చేశారు. ఈవో కలగర శ్రీనివాస్, కొండ్రెడ్డి కిషోర్, దాసరి శ్యామ్ చంద్రశేషు, లక్ష్మణరావు, సత్తి పండు, రామకుమార్ తదితరులు పాల్గొన్నారు.



చినవెంకన్నకు భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల క్షేత్రం శనివారం భక్తజనులతో కళకళలాడింది.సాధారణంగా శ్రావణ మాసంలో నెలపొడుపు, శనివారం కావడంతో ఆలయం భక్తులతో పోటెత్తింది మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో రద్దీ తగ్గినట్లు ఆలయ అధికారులు అభిప్రాయ పడు తున్నారు. సుమారు 12 వేల మంది వరకూ భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడాయి.

ద్వారకాతిరుమల సమాచారం

శ్రీవారి క్షేత్రంలో గదులు, కాటేజీల ఖాళీల వివరాలు

ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో ఈనెల 26న రాత్రి 7.30 గంటల సమయానికి ఖాళీ ఉన్న రూములు, కాటేజీల వివరాలిలా ఉన్నాయి.

రాణి చిన్నయమ్మారావు సదనం	27
టీటీడీ సత్రం	13
ధర్మ అప్పారాయ నిలయం	64
బాలాజీ సదనం	4
కాటేజీలు	29

రోడ్లు..పాట్లు..

గోతులా.. చెరువులా !

ప్రమాదకరంగా చింతలపూడి ప్రధాన రోడ్లు

చింతలపూడి, (ఆంధ్రజ్యోతి) "చింతలపూడి వెళ్తున్నావా బాబూ ... సాయంత్రం 6 గంటలైంది ఇప్పుడొద్దు. ఆ రోడ్డంతా ప్రమాదకరమైన గోతులు. అసలే మెయిన్ రోడ్డుమీద లైట్లు వెలగవు. చీకట్లో వద్దు బాబు.." చుట్టుపక్కల గ్రామాల నుంచి చింతలపూడి వచ్చే ప్రజలు వారి ఇళ్ళ వద్ద మాట్లాడుకునే మాటలివి. చింతలపూడి నగర పంచాయతీలో ప్రధాన రోడ్లు అడుగడుగునా గోతులు, వర్షం వస్తే ఆ గోతుల్లో నీరు చేరి చెరువుల్లా మారుతున్నాయి. రోడ్డంతా గాడిపడినట్టుగా ఉంటుంది. ద్విచక్ర వాహనాలు వెళ్తే ఆ గాడిలో పడి ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇటీవల ఆర్టీసీ బస్సు గోతిలో పడి చెట్టును ఢీకొని పలువురికి గాయాలుకాగా కొద్దిలో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రధానంగా ఏలూరు-సత్తుపల్లి రోడ్డులో పెద్దపెద్ద గోతులు.. చిన్నవర్షం వస్తే చెరువుల్లా తలపిస్తున్నాయి. పగటి వేళ ఈ విధంగా ఉన్నాయి. రాత్రివేళ ప్రయాణించాలంటే భయపడుతున్నారు. తెలిసినవారు జాగ్రత్తగా వెళ్తుంటే తెలియని వారు ఈ ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఐదేళ్ల ప్రభుత్వంలో ఈ రోడ్లను, గోతులను నరకం చూసిన పట్టణ ప్రజలు కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్లు బాగుపడతాయనుకుంటే ఏడాది దాటినా మార్పు లేదు. కొద్ది రోజుల క్రిందట కొన్ని గోతులు పూడ్చినా అవి నాసిరకంగా ఉండడంతో తిరిగి అవే స్థానంలో పెద్దపెద్ద గోతులుగా మారాయి. ఈ మార్గాల్లో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు నిత్యం తిరుగుతూనే ఉన్నారు. వారికి తెలియడం లేదా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లమీద నడిచే జనం కంటే వాహనాలే అధిక శాతంలో తిరుగుతుంటాయి. తూతూ మంత్రంగా నాసిరకం కాకుండా రోడ్డు ఇరుపక్కలా ఆక్రమణలు తొలగించి మార్జిన్లలో డ్రెయిన్ నీరు పోయే విధంగా రోడ్ల నిర్మాణం పటిష్టంగా చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



చింతలపూడి ఎస్ఐబీ నగర్ రోడ్డులో చెరువులా ఉన్న గోతులు



కొత్తబస్టాండ్ ఎదురుగా



ఏలూరు-సత్తుపల్లి రోడ్డులో రత్నాసెంటర్‌లో భారీ గొయ్యి

అడుగడుగునా గోతులే..

జీలుగుమిల్లి సెంటర్‌లో ప్రమాదాలకు గురి అవుతున్న వాహన చోదకులు

జీలుగుమిల్లి (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి మండల కేంద్రంలో నాలుగు రోడ్ల కూడలిలో అడుగడుగునా గోతులే. అశ్వారావుపేట- నుంచి జంగారెడ్డిగూడెం వైపు వెళ్లే రహదారి మరోవైపు ఏలూరు రోడ్డు ఎదురుగా పోలవరం వెళ్లే రహదారి నాల్గు రోడ్ల కూడలిలో గోతులు పడి వర్షపు నీటితో నిండిపోయాయి. వాహనాలు గోతుల్లో ఇరుక్కుపోయే పరిస్థితి నెలకొంది. తెలంగాణ ఆంధ్ర రాష్ట్ర సరిహద్దు దాటి యాకులగూడెం గ్రామం నుంచి జీలుగుమిల్లి వరకు గోతులు ఏర్పడటంతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీలుగుమిల్లి సెంటర్ బస్ షెల్టర్ ఎదురుగా రోడ్డంతా గొయ్యి పడింది. బస్ షెల్టర్ వద్ద ప్రయాణికులు వేచి ఉన్న సమయంలో రాకపోకలు సాగించే వాహనాలు బురద చల్లుతున్నాయి. దీంతో బస్ షెల్టర్‌కు దూరంగా ప్రయాణికులు వేచి ఉండాల్సి వస్తోంది. జగదాంబ ఆలయం ఎదురుగా గోతులు ఉండటంతో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద ఇదే పరిస్థితి ఉంది. దీంతోపాటు సీఆర్ఆర్ కాలనీలో రహదారిపై ఇళ్ల వద్ద వాడిన మురుగునీరు, వర్షం నీరు కలసి రహదారి చిత్తడిగా మారింది. సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఎన్‌హెచ్ అధికారులు రోడ్డు సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జీలుగుమిల్లి జంక్షన్‌లో జాతీయ రహదారిపై గోతుల్లో నిలిచిన వాన నీరు





దువ్వ నుంచి ఆరుళ్ల వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో ముద్దాపురం, కోనాల గ్రామాల్లో గోతులు

అధ్వానంగా దువ్వ-ఆరుళ్ల ఆర్అండ్‌బీ రోడ్డు

తణుకు రూరల్ (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలకు తణుకు మండంలోని గ్రామాల్లోని రోడ్లు గోతులు పడి ప్రయాణాలకు ఇబ్బందిగా మారింది. మండలంలోని దువ్వ జాతీయ రహదారి నుంచి ముద్దాపురం, కోనాల, ఆరుళ్ల వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు వర్షాల కారణంగా మరింత గోతులు పడి ప్రయాణాలకు తీవ్ర ఇబ్బంది మారిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. 4 సంవత్సరాల క్రితమే గోతులగా వుండటంతో రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు నాయకులను, అధికారులను కోరుతూ వస్తున్నారు. ఈ రోడ్డులో తణుకు రూరల్ మండలంలోని దువ్వ, ముద్దాపురం, కోనాల గ్రామాలతో పాటు పెంటపాడు మండ లంలోని ఆరుళ్ల గ్రామాల ప్రజలకు ఇటు దువ్వ నుంచి అత్తిలి, తణుకు, అటు తాడేపల్లి గూడెం, నిడదవోలు మండలంలోని గ్రామాలు వెళ్లేందుకు దగ్గరి మార్గంగా, సౌకర్యవంతంగా వుంటుంది. ఈ రోడ్డు పెద్ద పెద్ద గోతులతో మోటారు సైకిళ్లు కూడా వెళ్లలేని స్థితిలో అధ్వానంగా తయారైందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. దువ్వ నుంచి కోనాల వరకూ బీటీ రోడ్డు నిర్మించేందుకు రూ. 1 కోటి 20 లక్షలు మంజూరయ్యాయని టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే నిర్మాణ పనులు చేపడతామని ఆర్అండ్‌బీ జేఈ యశ్వంత్ తెలిపారు.



ఏపీడబ్ల్యుజే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్, చిత్రంలో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్, ఎస్పీ కిషోర్, ఏపీయూడబ్ల్యుజే, ఐజేయూ ప్రతినిధులు

సమాజంలో వికృత పోకడలను నియంత్రించే బాధ్యత అందరిది

ఏపీయూడబ్ల్యుజే కార్యవర్గ సమావేశంలో ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్

ఏలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వికృత పోకడలను నియంత్రించే బాధ్యత అందరిపై ఉందని, సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని పరిశీలించి, వ్యవహరించాలని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ అన్నారు. ఏలూరులో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఏపీ డబ్ల్యుజే) రాష్ట్ర కార్యవర్గ సమావేశాల ప్రారంభ సభలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రారంభ సభకు ఏపీడబ్ల్యుజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షత వహించారు. సురేష్ మాట్లాడుతూ గతంలో మీడియా ప్రభావం ఎక్కువగా ఉండేదని, కానీ ప్రస్తుతం కొంత తగ్గిందని, కానీ సమాజంలో విస్తృత ప్రయోజనాలు మీడియా వల్లే సాధ్యమన్నారు. జర్నలిస్టులకు అకాడమీ ద్వారా మెరుగైన శిక్షణ ఇస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ ప్రతాప్ కిషోర్ మాట్లాడుతూ నేడు సోషల్ మీడియాప్రభావం ఎక్కువగా ఉందన్నారు. విశాలాంధ్ర దినపత్రిక ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు మాట్లాడుతూ నేటి సమాజంలో వార్తా పత్రికలు విలువలు పాటించాలని కోరారు.ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ దేశంలో డిజిటల్ మీడియా ప్రభావం ఉందని, విద్యార్థినులు మీడియా పట్ల ఆసక్తి ఉంటే రావచ్చునన్నారు. సమావేశంలో ఏపీడబ్ల్యుజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీకే కిశోర్, బి.కిషోర్‌లు ఐజేయూ సభ్యులు నల్లి ధర్మారావు, డాక్టర్ ఎం.ప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, మేయర్ షేక్ నూర్జహాన్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు. ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు జీవీఎస్ఎన్ రాజు స్వాగతోపన్యాసం చేశారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు

ఏలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఈనెల 27 నుంచి ఆగస్టు 1వ తేదీవరకు నిర్వహించే పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఏపీపీఎస్సీ ద్వారా 4/2025 నోటిఫికేషన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత పరీక్షలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

2న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరుసిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆగస్టు 2వ తేదీన ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్టు జిల్లా పరిషత్ సీఈవో శ్రీహరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు.



ఉమ్మడి జిల్లా బాలుర బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఆగస్టు 14 నుంచి 17 వరకు పిఠాపురంలో జరిగే 10వ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా జూనియర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొనేందుకు ప్రత్తిపాడు సరస్వతీ విద్యాలయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఎంపికలు నిర్వహించినట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, సెక్రటరీ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్.సందీప్‌కుమార్, ఏ.ఈశ్వర్ తేజ, కిషోర్, ప్రభుకుమర్, సాంబ సూర్య, సోమశేఖర్, ఛార్లెస్ వెస్లీ, హేమసాత్విక్, ప్రవీణ్‌కుమార్, ఎస్‌కే యాసీన్, యశ్వంత్‌శర్మ, ధరణీధర్, రాకేష్, మణికంఠ, కళ్యాణ్‌రామ్, యోగిత్ వర్మలు ఎంపియ్యారు. వీరంతా పిఠాపురంలో జరిగే పోటీలో ప్రాతినిధ్యం వహిస్తారని ట్రెజరర్ కే.మురళీకృష్ణ తెలిపారు.

ఆసియా స్కేటింగ్‌లో జెస్సీరాజ్‌కు పతకం



దెందులూరు,జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ గ్రహీత, అంతర్జాతీయ స్కేటింగ్ క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్ అంతర్జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించింది. దెందులూరు మండలం జోగన్నపాలెం గ్రామానికి చెందిన జెస్సీ రాజ్ దక్షిణ కొరియాలో ఈనెల 24 నుంచి జరిగిన అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో జెస్సీరాజ్ సోలో డాన్స్ సబ్ జూనియర్ విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఇప్పటివరకు 50కి పైగా రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్, సిల్వర్ మెడల్‌లను కైవసం చేసుకుంది.



సిల్వర్ మెడల్‌తో జెస్సీరాజ్

భూ సమస్యలకు వైసీపీనే కారణం

- కాళీపట్నం భూ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళతా
- కూటమి పాలనలో రాష్ట్రానికి పది లక్షల కోట్ల పెట్టుబడులు
- 'సుపరిపాలన'లో మంత్రి అనగాని సత్యప్రసాద్



కాళీపట్నంలో మహిళలకు కరపత్రాలు ఇస్తున్న మంత్రి అనగాని

మొగల్తూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూ సమస్యలు పెరగడానికి గత వైసీపీ పాలనలో జగన్ తీసుకున్న అనాలోచిత నిర్ణయాలే కారణమని రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శనివారం కాళీపట్నం వెస్ట్ గ్రామంలో సుపరిపాలనలో ముందడుగు కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజుతో కలిసి ఆయన పాల్గొన్నారు. మంత్రికి కాళీపట్నం రెవెన్యూ పరిధిలోని 5 గ్రామాల ప్రజలు, రైతులు ఘన స్వాగతం పలికారు. కాళీపట్నం భూ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని మంత్రి రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ళ వైసీపీ పాలనలో సమగ్ర భూ సర్వే పేరుతో అనేక మార్పులు జరగడంతో భూ యజమానులు తమ భూములకు రక్షణ కొరవడి భయాందోళనకు గురయ్యారన్నారు. జలజీవన్ నిధులు వెనక్కు మళ్లాయని, కూటమి పాలనలో రాష్ట్రంలో ప్రతి నివాసానికి జలజీవన్ మిషన్ ద్వారా కుళాయి నీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏడాది కూటమి పాలనలో 10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకురావడంతో పాటు, రానున్న రోజుల్లో పది లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నట్టు తెలిపారు. త్వరలో నూతనంగా వితంతు పింఛన్లు మంజూరు చేస్తామన్నారు. సర్పంచ్ కవురు ఆదినారాయణ మంగతాయారు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, రాష్ట్ర మత్స్యకార సంఘాల కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీ కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గుత్తుల సాయి, మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పట్టాల పంపిణీలో అవకతవకలపై చర్యలు

ఆచంట: గత ప్రభుత్వంలో ఇళ్ళ పట్టాల విషయంలో అనేక అవకతవకలు జరగ్గా వాటిపై లబ్ధిదారులు కేసులు పెడితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి సత్యప్రసాద్ అన్నారు. ఆచంట మండలం ఆచంట, వేమవరంలో శనివారం సాయంత్రం జరిగిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి అనగానితోపాటు ఎమ్మెల్యే పితాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజలంతా పండుగ వాతావరణంలో సంతోషంగా ఉన్నారన్నారు. అర్హులకు ఇళ్ళ స్థలాలు, టిడ్కో ఇళ్ళు ఇవ్వడం జరుగుతుందన్నారు. జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపీపీ సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు. కాగా ఆచంటలో ప్రజలను పలకరిస్తూ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీస్తూ ఆయన పర్యటన ఉత్సాహంగా సాగింది.

గోదావరి స్వచ్ఛ జలాలు సరఫరా..

పెనుగొండ: జల్ జీవన్ మిషన్ ద్వారా వడలి గ్రామం నుంచి చుట్టుపక్కల 14 గ్రామాలకు గోదావరి స్వచ్ఛ జలాలు సరఫరా చేయనున్నట్లు మంత్రి సత్య ప్రసాద్ అన్నారు. వడలిలో రూ.198.42 కోట్ల వ్యయంతో ప్రారంభం కానున్న జల్ జీవన్ మిషన్‌కు భూమి పూజా కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించి తాగునీరు, రహదారి, డ్రెయినేజీ తదితర సమస్యలుపై ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి సంబంధిత అధికారులను వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ సుపరిపాలన అంటే ప్రజల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చే విధానం అన్నారు. పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, నక్కా వేద వ్యాస శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

వరహాపట్నంలో పేలుడు

- భూమి నుంచి విస్ఫోటం
- ఇద్దరికి తీవ్ర గాయాలు, ఒకరికి వినికిడి సమస్య
- పేలుడు పదార్థం లేదని తేల్చిన బాంబ్ స్క్వాడ్



పేలుడు జరిగిన ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు..



పేలుడులో గాయపడిన సామగాని కార్తీక్

కైకలూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): జనసంచారంతో కిటకిటలాడే ప్రధాన సెంటర్‌లో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించడంతో ప్రజలు ఉలిక్కి పడ్డారు. కైకలూరు మండలం వరహాపట్నంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వరహాపట్నం నాలుగురోడ్ల కూడలిలో శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఓ బడ్డీకొట్టును ఆనుకుని పేలుడు సంభవించింది. ఆ విస్ఫోటంతో అక్కడున్న యువకులకు తీవ్రగాయాలయ్యాయి. బడ్డీ కొట్టును ఆనుకొని గతంలో బైక్ మెకానిక్ షాపు ఉండేది. అంతేగాక శుక్రవారం రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఎక్స్‌కవేటర్‌తో ఆ ప్రాంతంలో గోతులను తవ్వి సరిచేశారు. తవ్వకాల్లో జరిగిన ఒత్తిడి మేరకో మరెందుకో పేలుడు సంభవించింది. దీంతో గ్రామానికి చెందిన కోనాల నాని, సామగాని కార్తీక్ పేలుడు నుంచి వచ్చిన రాళ్ళతో తీవ్ర గాయాలయ్యాయి. పడమటి శివగణేష్‌కు వినికిడి సమస్య తలెత్తింది. విషయం తెలుసుకున్న కైకలూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గతంలో ఆ ప్రాంతంలో బైక్ మెకానిక్ షాపు, బీఎస్ఎన్ఎల్‌కు చెందిన బాక్సులు ఉండేవని వాటిలో దేని నుంచో పేలుడు సంభవించినట్లుగా భావించారు. దీంతో బీఎస్ఎన్ఎల్, అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన పరికరాలేవీ లేవని నిర్ధారించారు. దీంతో ఏలూరు నుంచి బాంబ్, డాగ్ స్క్వాడ్‌ను కైకలూరు రూరల్ సీఐ వి. రవికుమార్, రూరల్ ఎస్సై వి. రాంబాబు ఆధ్వర్యంలో తీసుకువచ్చారు. బాంబు పేలిన స్థలాన్ని పరిశీలించినప్పటికి పేలుడు పదార్థాలు ఉన్నట్లు నిర్ధారణ కాలేదు. దీంతో ఎక్స్‌కవేటర్‌తో ఆ ప్రాంతాన్ని నాలుగడుగుల మేర తవ్వకాలు చేసినప్పటికీ ఎలాంటి అవశేషాలు కనిపించలేదు. పేలుడు దేనివల్ల సంభవించిందో నిర్ధారణకు రాలేకపోయారు. అక్కడ మద్యం సీసాలు కొన్ని ఉండడంతో అవి ఒత్తిడికి పేలి ఉండవచ్చని భావించారు. అయితే ఎలాంటి పేలుడు పదార్థాలు లేకపోవడంతో పోలీసులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



గణపవరంలో సుపరిపాలనలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు

రాష్ట్రంలో అరాచకం సృష్టించేందుకు వైసీపీ కుట్ర

- సుపరిపాలనలో మంత్రి అచ్చెన్నాయుడు
- గణపవరంలో ప్రజలను పలకరిస్తూ ఉత్సాహంగా పర్యటన

గణపవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు అగాథంలోకి నెట్టేసిన వైసీపీ నేడు రాష్ట్రంలో అరాచకం సృష్టించేందుకు యత్నిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం గణపవరంలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన సుపరిపాలనలో తొలి అడుగు సభ నిర్వహించారు. మంత్రి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇమ్మని కోరిన వ్యక్తి అధికారం అందుకుని రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించాడని విమర్శించారు. ప్రధాని మోదీ సాయంతో సీఎం చంద్రబాబు అనుభవంతో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందన్నారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులే ముఖ్యమంత్రి చంద్రబాబు కృషికి నిదర్శనమన్నారు.

ఉత్సాహంగా పర్యటన..

ఏం అవ్వా.. ఏం తమ్ముడూ బాగున్నావా? టీడీపీ ఏడాది పాలన ఎలా ఉంది? ఏమైనా దిద్దుబాట్లు అవసరమా అంటూ కుశల ప్రశ్నలతో మంత్రి అచ్చెన్నాయుడు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం గణప వరంలో ఆసక్తిగా సాగింది. వెలంపేట పర్యటనలో పలువురు ఇళ్లు, తాగునీరు తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. తొలుత మంత్రికి అభిమానులు, కార్యకర్తలు, మహిళలు హారతులు పట్టి గజమాలతో స్వాగతం పలికారు. గణపవరం సొసైటీ నూతన అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమార్ రాజు, పాలకవర్గాన్ని మంత్రి, గన్ని సత్కరించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణంరాజు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ, ఎమ్మెల్సీ రాజశేఖర్, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘ చైర్మన్ వలవల బాబ్జీ, ఉంగుటూరు నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జ్ మాలతీరాణి తదితరులు పాల్గొన్నారు.

గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో విలీనం చేయండి

పశ్చిమలో కొనసాగుతున్న గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో విలీనం చేసేందుకు సహకరించాలని మంత్రికి గణపవరం జనసేన నేతలు విజ్ఞప్తి చేశారు. శనివారం మార్గమధ్యంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, కార్యకర్తలు మంత్రికి స్వాగతం పలికి సత్కరించారు.

పెదవాగు సమస్యపై కొత్తగూడెం ఎమ్మెల్యేకు వినతి

వేలేరుపాడు, జూలై 26(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలోని పెదవాగు ప్రాజెక్టు తెగిపోయిన కారణంగా ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునేలా తెలంగాణ ప్రభుత్వాన్ని కోరాలని సీపీఐ మండల నాయకులు ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావును శనివారం కలిసి విజ్ఞప్తి చేశారు. పెదవాగు ప్రాజెక్టు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల పరిధిలో ఉందని ఇందులో అధిక వాటా ఆంధ్రా కలిగి ఉండటం కారణంగా తెలంగాణ ప్రభుత్వం ప్రాజెక్టు మరమ్మతులపై దృష్టి పెట్టడంలేదని ఇటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ప్రాజెక్టు మరమ్మతులకు నిధులు విడుదల చేయడం లేదని ఆయనకు వివరించారు. పెదవాగు ప్రాజెక్టు మరమ్మతుల విషయంపై తాను ఇప్పటికే జిల్లా మంత్రుల దృష్టికి తీసుకెళ్లానని ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే సాంబశివరావు వారికి హామీ ఇచ్చారు.

క్రైం సమాచారం

పోక్సో కేసులో ముద్దాయిలపై రౌడీషీట్ : ఐజీ

ఏలూరు క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : పోక్సో కేసులో ఉన్న ముద్దాయిలపై రౌడీషీట్లను ఓపెన్ చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏలూరు జిల్లా అర్ధ సంవత్సర నేర సమీక్ష సమావేశాన్ని ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ కిశోర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రతి కేసు దర్యాప్తును డాక్యుమెంట్ల రూపంలో సేకరించాలని, ప్రాపర్టీని తరచుగా పరిశీలించాలన్నారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సిబ్బంది దర్యాప్తులో నైపుణ్యాన్ని సంపాదించుకుంటూ చార్జిషీట్లను కోర్టులో ఫైల్ చేయాలన్నారు. డీఎస్పీలు తమ పరిధిలో ఉన్న కేసుల వివరాలు సేకరించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేయడానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. పోక్సో కేసులోని 60 రోజులలో దర్యాప్తు పూర్తి చేసి సంబంధిత కోర్టులో ఫైల్ చేయాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసి డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

జిల్లా ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ కేసుల దర్యాప్తులను వేగవంతంగా పూర్తి చేయడమే పోలీసు లక్ష్యమన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టామన్నారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక గస్తీని ఏర్పాటు చేశామని, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేసి ఆకతాయిలకు చెక్ పెట్టామన్నారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో గత సంవ త్సరంతో పోల్చుకుంటే 29 శాతం నేరాలు తగ్గాయని, జిల్లా ఎస్పీ కిశోర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానం ప్రవేశపెట్టడం వల్ల ఈ ప్రగతి సాధించగలిగామన్నారు. ప్రాసిక్యూషన్స్ డిప్యూటీ డైరెక్టర్ ఎం శారదామణి, రవాణాశాఖ ఆర్టీవో కృష్ణారావు, ఏలూరు ప్రభుత్వాసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ త్యాగి, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఆవులయ్య, డీఎస్పీలు, పీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్, పాల్గొన్న ఎస్పీ కిశోర్

తెలంగాణ రోడ్డు ప్రమాదంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ చక్రధరరావు మృతి

- పాలకొల్లు పట్టణంలో విషాద చాయలు



చక్రధరరావు (ఫైల్)

పాలకొల్లు టౌన్, జూలై26(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి జిల్లా కైతాపురం వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీలు ఇద్దరు మృతి చెందగా వారిలో ఒకరు పట్టణానికి చెందిన మేకా చక్రధరరావు(51) ఉన్నారు. పట్టణంలో విషాద చాయలు అలుముకున్నాయి. మృతుడు చక్రధరరావుకు భార్య కిరణ్మయి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చక్రధరరావు అన్నయ్య త్రిశూలపాణి పట్టణంలో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. చక్రధరరావు మృతికి మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, టీడీపీ నాయకులు జీవీ, పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరు నాయుడు, ఎం.ఫకీర్ బాబు, గాంధీ భగవాన్‌రాజు, కోడి విజయభాస్కర్, జాతీయ తెలుగుసారస్వత పరిషత్ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ తదితరులు సంతాపం తెలిపారు.

ఇద్దరిని గాయపరిచిన ఆటో డ్రైవర్‌పై కేసు

టి.నరసాపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా ఆటో నడిపి ఇద్దరు వ్యక్తులను గాయపరిచిన ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. వివరాలివి.. బొర్రంపాలెం గ్రామానికి చెందిన ముడుపుల సాయిగణేశ్, అడవికొట్టు కిశోర్ ఈ నెల 15న మోటార్ సైకిల్‌పై వెళ్తూ ముందుగా వెళ్తున్న లారీని స్థానిక పీహెచ్‌సీ సమీపంలో తప్పించే క్రమంలో పక్కనుంచి వెళ్తున్న ఆటోడ్రైవర్ షేక్ అజ్గర్ ఆటోను నిర్లక్ష్యంగా నడుపుతూ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో బైక్‌కు తగిలి కింద పడిపోగా ఇద్దరికి గాయాలయ్యాయి. రక్తగాయాలైన సాయిగణేశ్‌ను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు సాయిగణేశ్ తల్లి ముడుపుల సరస్వతి ఫిర్యా దుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

భీమవరం క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఒక బాలికపై అత్యాచారానికి ప్రయత్నించిన వ్యక్తిని శనివారం అరెస్ట్ చేశామని భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. పట్టణానికి చెందిన ఒక బాలిక నిద్రిస్తుండగా గదిలోకి వెళ్లి అరిస్తే చంపేస్తానని బెదిరించి అత్యాచారానికి కారెం భానుతేజ అనే వ్యక్తి ప్రయత్నించాడు. బాలిక కేకలు వేయడంతో పరారయ్యాడు. బాలిక తల్లి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసి శనివారం అతడిని అరెస్ట్ చేసి కోర్టుకు పంపగా కోర్టు రిమాండ్ విధించిందని డీఎస్పీ తెలిపారు.

మనస్తాపంతో మెకానిక్ ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం కొమడవోలులోని ఆండాళ్ళమ్మ తోటలో నివాసం ఉంటున్న కానూరి సాయిబాబు(29) మోటారు సైకిల్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలం క్రితం అతనికి భార్యతో గొడవ జరిగింది. ఆమె పుట్టింటికి వెళ్లి తిరిగి రావడంలేదు. మనస్తాపానికి గురైన అతడు తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై అతడి సోదరుడు ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి బంధువులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి ఆత్మహత్య

భీమవరం క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు వన్‌టౌన్ ఎస్ఐ కృష్ణాజీ తెలిపారు. భీమవరంలోని విద్యుత్ శాఖలో లైన్‌మన్‌గా పనిచేస్తున్న ముత్యం రవి రాజ్‌కుమార్(27) మూడు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. ఎంప్లాయీస్ కాలనీలో ఓ ఇంటి రెండో అంతస్తులో అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి యజమాని రాజ్‌కుమార్ తండ్రి కర్నేలుకు ఫోన్ చేసి కుమారుడు రాత్రి నుంచి బయటకు రాలేదని, ఫోన్‌కు కూడా స్పందించడం లేదని చెప్పారు. ఈ మేరకు కర్నేలు భీమవరం చేరుకుని తలుపులు కొట్టినా ఫలితం లేకపోవడంలో కిటికీలోంచి చూసేసరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. తలుపులు బద్దలు కొట్టి చూసేసరికి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. ఇటీవల మానసిక ఒత్తిడితో తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండవచ్చని పెళ్లి కోసం అప్పులు తీసుకుని ఆర్థిక ఒత్తిడే తన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడేలా చేసినట్లుగా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

ముసునూరు, జూలై26(ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి తాళలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని గోగులంపాడు కొత్తూరుకు చెందిన చెన్ను గురునాథం (65) నాలుగు నెలలుగా కడుపునొప్పితో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం తట్టుకోలేనంతగా నొప్పి రావడంతో ఇంటిలో ఉన్న గడ్డి మందు తాగి అత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే కుటుంబీకులు అతనిని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

బాలుడి అదృశ్యం.. కేసు నమోదు



సాయి గణేష్ (ఫైల్)

మొగల్తూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బాలుడు అదృశ్యంపై కేసు నమోదు చేశామని మొగల్తూరు ఎస్ఐ వై.నాగలక్ష్మి తెలిపారు. మొగల్తూరుకు చెందిన చామకూరి సత్యనారాయణ మొగల్తూరులో నివాసం ఉండేవారు. జీవనోపాధి నిమిత్తం కొంత కాలం నుంచి కేపీపాలెంలో నివాసం ఉంటున్నారు. ఆయన కుమారుడు చామకూరి సాయిగణేష్ ఇంటర్మీడియట్ చదివి ఇంటి వద్దనే ఉంటున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు చేశాడన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆకివీడులో ఐదుగురు గంజాయి నిందితులకు రిమాండ్

ఆకివీడు, జూలై26(ఆంధ్రజ్యోతి):గంజాయి విక్రయదారుడు, నలుగురు కొనుగోలు దారులు మొత్తం ఐదుగురు నిందితులను శనివారం అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా పద్నాలుగు రోజులు రిమాండ్ విధించిందని సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. స్థానిక ప్యాట్రిక్ నగర్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి దగ్గర గంజాయి అమ్ముతున్నట్లు ఎస్ఐ హనుమంతు నాగరాజుకు సమాచారం రావడంతో రెవెన్యూ సూపరింటెండెంట్ ఫరూఖ్, ఆర్ఐ ఆంజనేయులు, వీఆర్వోలతో పాటు పోలీసులు వెళ్లి ఆ ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, మారేడుపల్లికి చెందిన పోడియం జగదీష్ మణికంఠ రూ.30వేలు విలువైన సుమారు మూడు కేజీల గంజాయి తీసుకొచ్చాడు. దానిని కొనుగోలు చేసేందుకు తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన ప్రదక్షిణం రవి, ఆకివీడు మండలం చెరుకుమిల్లికి చెందిన వేగేశ్న పవన్ కల్యాణ్ వర్మ, స్థానిక సమతానగర్‌కు చెందిన కొమ్మారెడ్డి సత్యనారాయణ, ఆకివీడు రైల్వే స్టేషన్ రోడ్డులో నివశిస్తున్న నైనార్ ప్రసాద్ వచ్చారు. వారిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలిం చగా పద్నాలుగు రోజులు రిమాండ్ విధించిం దని సీఐ తెలిపారు.

భీమవరంలో ఇద్దరి అరెస్ట్

2 కేజీల 166 గ్రాములు స్వాధీనం

భీమవరం క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలోని లూథరన్ హైస్కూల్ గ్రౌండ్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో వన్‌టౌన్ సీఐ నాగరాజు, సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో గునుపూడికి చెందిన తమరకొండ రిషీల్, కొండేటి మణికంఠ శివకుమార్ అనే వారిని అరెస్ట్ చేసి వారిద్దరి వద్ద 2 కేజీల 166 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరు ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్ వర్మ వద్ద కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నారని విచారణలో తేలింది. ప్లాస్టిక్ సంచులతో గంజాయి ఉండగా పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని పట్టుకుని అరెస్ట్ చేశారు.



భీమవరంలో గంజాయి నిందితులతో వన్‌టౌన్ సీఐ నాగరాజు, పోలీసులు

జనావాసాల్లో పందులు పెంచొద్దు : కమిషనర్

ఏలూరుటూటౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): జనావాసాల్లో పందులను పెంచే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ హెచ్చరించారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాల్లో పందుల సంచారంపై తనిఖీలు నిర్వహించారు. పందుల యాజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. నగరంలో పందులు సంచరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, మెడికల్ వ్యర్థాలు ఉండడంతో ఆసుపత్రి సిబ్బందిని శుభ్రపరచాలని కోరారు.

గురుకులం కాలేజీ సమస్యల పరిష్కారానికి కృషి : పత్సమట్ల

భీమడోలు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పోలసానపల్లి గురుకుల కళాశాల ఇబ్బందులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం స్థానిక కళాశాలను ఆయన సందర్శించి, ల్యాబ్ గదులు కూలిపోయిన నేపథ్యంలో వాటి స్థానంలో తాత్కాలిక నిర్మాణాలకు కృషి చేస్తానన్నారు. గురుకుల కళాశాల నూతన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. గ్రామ సర్పంచ్ షేక్ హసీనా రహీమాబేగం వాసురాజు, ప్రత్తి మదన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల చేయూతకు ముందుకు రావాలి : కలెక్టర్ వెట్రిసెల్వి



పీ-4 సభలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, మేయర్ నూర్జహాన్, కమిషనర్ భానుప్రతాప్

ఏలూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో పీ-4 కింద బంగారు కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు మార్గదర్శిలు ముందుకు వచ్చి దత్తత తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. పీ-4 కార్యక్రమం కింద 23,24వ డివిజన్‌ల సచివాలయాలకు సంబంధించి స్థానిక పవర్‌పేట వినాయక గుడి వద్ద శనివారం బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల సదస్సులో కలెక్టర్, మేయర్ షేక్ నూర్జహాన్, కో-ఆప్షన్ ఎస్ఎంఆర్ పెదబాబు సంయుక్తంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు మార్గదర్శకులు తమ వంతు సహకారం అందించాలన్నారు. పీ-4 కార్యక్రమం కింద రాష్ట్రంలో 15 లక్షలు, ఏలూరు జిల్లాలో 75 వేల బంగారుకుటుంబాలను లక్ష్యంగా పెట్టుకుని దత్తత తీసుకునే కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మేయర్ నూర్జహాన్, ప్రత్యేకాధికారి కె. పంకజ్‌కుమార్, కమిషనర్ ఎ.భానుప్రతాప్, ఇన్‌ఛార్జి తహసీల్దార్ గాయత్రి, కార్పొరేటర్ యర్రంశెట్టి సుమన్, వార్డు సచివాలయ ఉద్యోగులు, టీడీపీ ఇన్‌ఛార్జులు దాకారపు రాజేశ్వరరావు, కిలారుశెట్టి సంధ్యాలక్ష్మి పాల్గొన్నారు.

ఏలూరు టౌన్ ప్లానింగ్ అధికారి
అవినీతిపై విచారణ చేయాలి


డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకుడు

ఏలూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగర పాలక సంస్థలో పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారి అవినీతిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జివరపు రవిప్రకాష్ కోరారు. శనివారం జిల్లా రెవెన్యూ అధికారి, ఏలూరు జిల్లా అదనపు కలెక్టర్ వి.విశ్వేశ్వరరావును కలిసి వినతి పత్రం అందజేశారు. నగర పాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు ప్లాన్ అప్రూవల్‌కు, గృహాలు నిర్మించుకునే వారి నుంచి బలవంతపు వసూళ్లు చేస్తున్నాడని డీఆర్‌వో దృష్టికి తీసుకెళ్లారు. అతడి అవినీతికి సహకరిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


స్టూడెంట్ కౌన్సిల్‌కు ఎన్నికైన విద్యార్థులతో సీఆర్ఆర్ విద్యాసంస్థల యాజమాన్యం

'విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అవసరం'

ఏలూరు అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూలులో ఇటీవల నిర్వహించిన విద్యార్థి మండలి ఎన్నికల్లో పలు విభాగాల నుంచి విజేతలుగా నిలిచిన బాలబాలికలతో శనివారం పెట్టుబడి వేడుక(ఇన్వెస్టిచర్ సెర్మనీ) పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో కెప్టెన్లు, వైస్ కెప్టెన్లకు బ్యాడ్జీలను బహూకరించి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. సీఆర్ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, జాయింట్ సెక్రటరీ వంకినేని భానుప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో బాధ్యత, క్రమశిక్షణతోపాటుగా నాయకత్వ లక్షణాలు అవసరమని పేర్కొన్నారు. స్కూలు ప్రిన్సిపాల్ పి.సాయికుమారి శంకర్ మాట్లాడుతూ గతనెల 10వ తేదీన స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించామన్నారు. సీఆర్ఆర్ విద్యాసంస్థల కోశాధికారి ప్రసాదరావు, కరస్పాండెంట్ వంకినేని రఘుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

ఏలూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు పనిచేసిన చోటల్లా విద్యార్థులకు ఉత్తమ బోధన చేస్తే వారిని చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని శనివారపుపేట జిల్లా పరిషత్ పాఠశాల హెచ్ఎం జి.ప్రకాష్ రావు అన్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా జడ్పీ పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన పలువురు ఉపాధ్యాయులను సహచర ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్ఎం మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎక్కడ పనిచేసిన సమయపాలన తప్పక పాటించాలన్నారు. విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. అనంతరం బదిలీపై శనివారపుపేట జడ్పీ పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు అన్నపూర్ణ, ప్రొన్సినా వెంకన్న, పీడీ పద్మలత పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

లింగపాలెం,జూలై 26(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని లేదంటే లైసెన్స్ రద్దుచేసి కేసులు నమోదు చేస్తామని ధర్మాజీగూడెం ఏఎస్ఐ రాంబాబు హెచ్చరించారు. శనివారం ధర్మాజీగూడెంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని అలాచేస్తే వాహనాలు నడిపే మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ తనిఖీలలో సిబ్బంది పాల్గొన్నారు.

మహర్దశ

(5వ పేజీ తరువాయి)

ఏడు ఎంఎల్‌డీ కెపాసిటీ గల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మిస్తున్నారు. ఎనిమిది రిజర్వాయర్లను ఏర్పాటు చేస్తారు. 98.81 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేస్తారు. నూతనంగా ఇంటింటికి ఆరు వేల కుళాయిలు వేస్తారు. నాగిరెడ్డిగూడెం రిజర్వాయర్ నుంచి తాగునీరు సరఫరా చేస్తారు.

- నూజివీడుకు తాగునీటి కోసం రూ.13.87 కోట్లు కేటాయించారు. వీటిని పాడైన పైపులైన్ల మరమ్మతుల కోసం వినియోగిస్తారు. కొత్తగా నాలుగు వేలు ట్యాప్ కనెక్షన్లు ఇస్తారు.
- జంగారెడ్డిగూడేంకు తాగునీటి సరఫరా కోసం 101.16 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో 30 ఎంఎల్‌డీ కెపాసిటీ గల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మిస్తారు. 45.43 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేస్తారు. నాలుగు రిజర్వాయర్లను నిర్మిస్తారు. కొత్తగా 9,486 కుళాయి కనెక్షన్లు ఇస్తారు.

డయాలసిస్.. కష్టాలు తీరాయి!

(5వ పేజీ తరువాయి)

కిడ్నీ బాధితులకు రూ.10 వేలు పెన్షన్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ పెన్షన్ మొత్తం ఒక్కొక్క రోగికి రూ.7 వేలు మాత్రమే అందేది.

రోగులు పెరిగితే మరిన్ని సౌకర్యాలు

కైకలూరు ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ కేంద్రంలో రోగుల సంఖ్య పెరిగితే డయాలసిస్ మెషీన్ల సంఖ్య పెరగనుంది. ఇప్పటికే ఉన్న ఐదు బెడ్లు, మిషన్ల ద్వారా రోగులకు రెండు దశల్లో డయాలసిస్ అందిస్తున్నం దున రోగుల సంఖ్య పెరిగితే మరో నాలుగు బెడ్లు, మిషన్లు ఏర్పాటు చేసేందుకు వైద్యాధికారులు పేర్కొంటున్నారు.


ఏలూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి


దెందులూరు క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని


కామవరపుకోట 'సుపరిపాలన తొలి అడుగు'లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ

కూటమితోనే పారదర్శక పాలన

ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ

ఏలూరుటూటౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తోనే పారదర్శకంగా పరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. శనివారం ఏలూరు టీడీపీ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టే విధంగా అధికారులను ఆదేశిస్తున్నామన్నారు. వైసీపీ అరాచక విధానాలకు చరమగీతం పాడి పారదర్శకంగా పరిపాలిస్తున్నామన్నారు. ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటానన్నారు. దంగేటి మనోహన్, పార్థసారథి, శివప్రసాద్, లంకా మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు : కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూనే ప్రజా సమస్యలను ఇంటింటికి వెళ్లి తెలుసుకుని వాటి సరిష్కారానికై సుపరిపాలనపై తొలి అడుగు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు .శనివారం దెందులూరు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో అధికారులతో గ్రీవెన్స్ నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు, అనంతరం సంబంధిత శాఖ అధికారులకు వాటిని బదిలీ చేశారు. ఆయన మాట్లాడుతూ దెందులూరు మండలంలో 80 శాతం సబ్సిడీతో రూ 10 లక్షల రూపాయిల విలువ కలిగిన ఎనిమిది వ్యవసాయ సంబంధిత డ్రోన్ పరికరాలను అందించామన్నారు. గ్రీవెన్స్‌లో నాలుగు మండలాల అధికారులు పాల్గొన్నారు,

● కామవరపుకోట : సమాజంలో పేదలకు చేయూతను అందిస్తూ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న సీఎం చంద్రబాబును అందరూ ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ పిలుపు నిచ్చారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని స్థానిక పంచాయతీలోని ముదురాజుల కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటి పర్యటన చేపట్టారు. కరపత్రాలను ఇంటింటికీ అందచేసి పథకం అమలు తీరుపై ప్రజల నుంచి వివరణ కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఘంటా సత్యంబాబు, గోపి, కటికర్ల నాని, గొల్లుబోయిన ప్రసాద్, రెబ్బా పరా త్వరరావు, శివ, పాకలపాటి సుధీర్, ఏడు కొండలు, కళ్యాణం, పందుల తోపాటు జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● ఆడమిల్లి, తడికలపూడి తదితర గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ఏలూరి శివరామ కృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోనేరు వెంకటసుబ్బారావు,కామవరపుకోట ఉప సర్పంచ్ నెక్కలపు సూర్యనారాయణ, టీడీపీ నాయకులు నెక్కలపు గంగాధరరావు, నూతి రాటాలు, పర్సా శ్రీను ఉన్నారు.


బాలుర వసతి గృహాన్ని సందర్శించిన కె.రత్నప్రసాద్

'నాణ్యమైన ఆహారం అందించండి'

ఏలూరు క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఆహార పదార్థాలను బాలలకు అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు శనివారపుపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని శనివారం ఆయన సందర్శించారు. బాలుర వసతి గృహంలో బాలురకు అందిస్తున్న వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల నాణ్యత విషయంలో రాజీ పడవద్దన్నారు. విద్యార్థులు సైన్స్ టీచర్ కొరత ఉందని తెలియజేశారని, ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. సూపరింటెండెంట్ శ్రీవల్లి, న్యాయవాది తుమరాడ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

ఏలూరు క్రైం,జూలై26(ఆంధ్రజ్యోతి): జూనియర్ న్యాయవాదులు చట్టాలపై పూర్తి అవగాహన పొంది కక్షిదారులకు త్వరితగతిన న్యాయ సహాయం అందించాలని ఏడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వై.శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు బార్ న్యాయవాదులకు జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ప్రజలకు, జూనియర్ న్యాయవాదులకు చట్టాలపై అవగాహన కలిపంచాలనే ఉద్దేశంతో అవగాహన సదస్సును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏడో అదనపు జిల్లా జడ్జి వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు పలు చట్టాలపై అవగాహన కల్పించుకోవాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రతి శనివారం మధ్యాహ్నం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జూనియర్ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయంవద్ద ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నాయకుల ధర్నా

జీతాలు చెల్లించాలని టీచర్ల ధర్నా

ఏలూరు అర్బన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బదిలీ టీచర్లకు రెండునెలల జీతాలను చెల్లించడానికి విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. శనివారం స్థానిక డీఈవో కార్యాలయం వద్ద యూటీఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ మాట్లాడుతూ బదిలీలు ముగిసి 45 రోజులు గడుస్తున్నా కౌన్సెలింగ్ ద్వారా కొత్త పాఠశాలలకు బదిలీ అయిన టీచర్లకు జీతభత్యాలు చెల్లించేందుకు ఆర్థిక శాఖ అనుమతిని పొందకపోవడం, కేడర్ స్ట్రెంగ్త్, పొజిషన్ ఐడీల సమస్యను పరిష్కరించకపోవడం ఉపాధ్యాయులపట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందనడానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన సాధారణ, ఐచ్ఛిక సెలవులను వినియోగించుకోవడంపై ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపించారు. యాప్‌ల భారాన్ని తగ్గిస్తామని చెబుతూనే ఒకే యాప్‌లో అనేకరకాల సమాచారాలు పెట్టమంటున్నారని విమర్శించారు. ధర్నా అనంతరం డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్‌ముస్తఫాఅలీ, ఎన్. రాంబాబు, సుధారాణి, రంగమోహన్, కమల్ కుమార్, శివశంకర్, అంజనాదేవి, తదితరులు పాల్గొన్నారు.


రామానుజపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎంవో గోవిందరావు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ద్వారకాతిరుమల, జూలై 26(ఆంధ్రజ్యోతి): వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. సీహెచ్ పోతేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని రామానుజపురం గ్రామంలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యసిబ్బంది ఇంటింటా ఫీవర్ సర్వే చేశారు. దోమలు లార్వాలు పెరిగే ప్రాంతాలను గుర్తించి వాటిని నాశనం చేయించారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎటువంటి అనారోగ్య సమస్యతలెత్తినా వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణాధికారి ఎంవీ జగన్‌మోహన్, కిశోర్, ఆరోగ్యకార్యకర్తలు కృపకుమారి, ఇందిర, లక్ష్మి, శైలజ, మంగ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్, క్రిష్టియన్ మైనార్టీ నాయకులు

గిరిజనుల దీక్షకు కాంగ్రెస్ నాయకుల మద్దతు

బుట్టాయగూడెం, జూలై 26(ఆంధ్రజ్యోతి): గిరిజనులు సాగు చేస్తున్న ఎల్‌టీఆర్ 1/70 చట్టం భూములను ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో కొనుగోలు చేయవద్దంటూ ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు తహసీల్దార్ కార్యాలయం రిలే నిరహార దీక్షలు చేపట్టారు. శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు చిడిపి కుటుంబరావు, ఎ.ఏసుపాదం దీక్షల్లో పాల్గొని మద్దతు తెలిపారు. గిరిజనుల న్యాయమైన డిమాండ్లను అధికారులు పరిష్కరించాలన్నారు. ఎటువంటి వివాదాలులేని భూములనే ప్యాకేజీలో కొనుగోలు చేసి నిర్వాసిత గిరిజనులకు ఇవ్వాలన్నారు. అధికారుల చర్యలు కారణంగా గిరిజనుల మధ్య గొడవలు జరగడం సరైందికాదన్నారు. దీక్షలు చేస్తున్న గిరిజనులకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం రామకృష్ణ, తామా ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



హెచ్ఎం విజయ్‌కుమార్‌కు కుర్చీలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల వితరణ

దెందులూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): దెందులూరు గారపాటి హైమవతి దేవి ఉన్నత పాఠశాల హెచ్ఎం వడ్లపట్ల విజయ్‌కుమార్‌కు పూర్వ విద్యార్థులు కుర్చీలను బహూకరించారు. దెందులూరు హైస్కూల్‌లో 1989-90లో టెన్త్ చదివిన విద్యార్థులు సంపంగి సింహాచలం, మామిడి శ్రీనివాసరావు, గుళ్ళపూడి వెంకటేశ్వరరావు తదితరులు 25 కుర్చీలను 25 కుర్చీలను హెచ్ఎంకు శనివారం అందజేశారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.


అచ్చెన్నాయుడిని కలిసి బొకే అందిస్తున్న గన్ని, తెలుగు యువత నాయకులు

రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడికి
ఘన స్వాగతం

ఉంగుటూరు,జూలై 26(ఆంధ్ర జ్యోతి): ఉంగుటూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రెడ్డి సూర్యచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు వేములపల్లి సుధీర్, చేబ్రోలు సొసైటీ అధ్య క్షులు కడియాల రవిశంకర్, ఇమ్మణ్ణి గంగాధరరావు, ఉంగుటూరు నాయకుడు బండారు మధు తదితరులు కలిసి స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని గణపవరం మండలంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న సందర్భంగా ఆయనను స్థానిక పార్టీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

స్మార్ట్ మీటర్లపై ప్రజలకు
అవగాహన కల్పిస్తాం

జంగారెడ్డిగూడెం,జూలై26(ఆంధ్రజ్యోతి) : డిజిటల్ స్మార్ట్ మీటర్లు అమర్చడం వల్ల పాత విద్యుత్ మీటర్ కంటే అదనంగా విద్యుత్ బిల్లు వస్తుందనేది కేవలం అపోహ మాత్రమేనని దీనిపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పిస్తామని విద్యుత్ శాఖ డీఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. శనివారం స్థానిక డీఈ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాలతో ప్రతీ ఇంటికి విద్యుత్ స్మార్ట్ మీటర్లు అమరుస్తున్నామని తెలిపారు. వినియోగదారుడు వాడిన కరెంట్‌ను తక్షణమే లెక్కించి సమాచారాన్ని డిజిటల్‌గా పంపగలిగిన సామర్థ్యం స్మార్ట్ మీటర్‌కు ఉంటుందన్నారు. ఆవిధంగా లెక్కించడం వల్ల వినియోగదారుడు తన ఫోన్‌లోనే మొబైల్ యాప్ ద్వారా ఎంత కరెంట్ వాడారో తెలుసుకుని విద్యుత్ పొదుపు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. స్మార్ట్ మీటర్ల వినియోగానికి ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో ఏడీఈ సుబ్బారావు, ఈఆర్‌వో ఏసురాజు పాల్గొన్నారు.

రేపు తహసీల్దార్
కార్యాలయాల వద్ద ధర్నా

ఏలూరుకార్పొరేషన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని, పాత క్లెయిమ్‌లు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 28న జిల్లా వ్యాప్తంగా అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసడాంగే, ఏఐటీయూసీ నాయకులు పళ్ళెం కిషోర్, ఏపీ బిల్డింగ్ అండ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ చేపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించి అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బోర్డును పునరుద్ధరించాలని, పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేబినెట్ నిర్ణయంపై నూర్‌బాషా
సంఘ నాయకుల హర్షం

ద్వారకాతిరుమల, జూలై 26(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖలో ఉన్న నూర్‌బాషా ఫైనాన్స్ కార్పొరేషన్‌ను మైనార్టీ సంక్షేమశాఖకు మార్చుతూ కేబినెట్ ఆమోద ముద్ర వేయడాన్ని నూర్‌భాషాల సంఘ నాయకుల హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 24న నూర్‌బాషా దూదేకుల సమస్యలపై నూర్‌బాషా టీడీపీ నేతలు నాగుల్ మీరా, నూర్ బాషా ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబన్, షేక్ సుబాన్, షేక్ మీరా, ఆరిఫ్, బాలాజీ, షేక్ ఇబ్రహీం, షేక్ సర్దార్, తదితరులు మైనార్టీ సంక్షేమ కార్యదర్శి శ్రీధర్, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్‌సత్యనారాయణను కలిసి విన్నవించారు. దీనికి కృషి చేసిన ప్రభుత్వ సలహాదారు జనాబ్ ఎంఏ షరీఫ్‌కు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాణాలు తీసిన అతివేగం / ఎదురెదురుగా బైక్‌లు ఢీకొని ఇద్దరు యువకుల మృతి

బంటుమిల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందగా, ఓ యువకుడు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఘటన కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం పెందుర్రు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కృత్తివెన్ను మండలం అడ్డపర్రు గ్రామానికి చెందిన నైంద్రు నరేష్(25) బంటుమిల్లి నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం ఏపూరు గ్రామానికి చెందిన చెరుకుమిల్లి శివకుమార్ (25), గుర్రం పవన్‌కుమార్ యానం నుంచి హనుమాన్ జంక్షన్ బయలుదేరారు. పెందుర్రు శివారు 216 జాతీయ రహదారిపై మిలేష్ కంపెనీ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఏపూరుకు చెందిన చెరుకుమిల్లి శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. నైంద్రు నరేష్, గుర్రం పవన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నైంద్రు నరేష్ మృతి చెందాడు. పవన్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉంది. బంటుమిల్లి ఎస్ఐ గణేష్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

మొబైల్ వాడకంతో అనేక అనర్థాలు

కామవరపుకోట, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ వాడడంతో అనేక అనర్థాలు ఉన్నాయని తడికలపూడిలోని జీసెస్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ రాంబాబు, ప్రిన్సిపాల్ యోహాన్, మణికుమార్ విజ్ఞప్తి చేశారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులందరినీ సమావేశపరిచి మొబైల్ ఫోన్ వాడవద్దని, తద్వారా జరిగే నష్టాలను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వాడడం వల్ల అనారోగ్యం పాలవుతారని, మేధస్సు తగ్గుతుందని, కంటి చూపు, జ్ఞాపకశక్తి తగ్గుతుందని, మొబైల్ ఫోన్‌లను వాడవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మంత్రి సారథి చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు

చాట్రాయి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం, తుమ్మగూడెం పీఏసీఎస్‌లు నిర్మించిన పెట్రోల్ బంకులను గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం ప్రారంభిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంకా చిత్తపూరులో రక్షిత మంచినీటి ట్యాంకు, పోలవరం, తుమ్మగూడెంలలో ఎన్టీఆర్ విగ్రహాలు ఆవిష్కరించి, బూరుగుగూడెంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటారని, పార్టీ శ్రేణులంతా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
నూజివీడు, కైకలూరు

గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం

ముదినేపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): కాకరవాడలో గురువారం క్యాంప్ బెల్ కెనాల్‌లో స్నానం చేస్తూ కొట్టుకుపోయిన గ్రామానికి చెందిన మరీదు వెంకటేశ్వరరావు (62) మృతదేహం లభ్యమైంది. రెండు రోజులుగా ఆ కాల్వలో పోలీసు, అగ్నిమాపక దళ సిబ్బందితోపాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు ఆ వృద్ధుడి కోసం గాలిస్తుండగా, శనివారం మధ్యాహ్నం శ్రీహరిపురం సమీపంలో ఒక ముళ్ల పొదలో చిక్కుకున్న వెంకటేశ్వరరావు మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అతని కుటుంబీకులకు పోలీసులు అప్పగించారు.

శిథిల భవనం వివరాలు పంపండి : డీఈవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముదినేపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు శివారు అప్పారావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం పరిస్థితిపై పూర్తి వివరాలు పంపాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ మండల విద్యాశాఖ అధికార్లను ఆదేశించారు. 'శిథిల భవనంలోనే చదువులు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన కథనానికి స్పందించిన డీఈవో ఆ పాఠశాల భవనం శిథిలమైన తీరు, ప్రస్తుత పరిస్థితిపై నివేదిక పంపాలని ఆదేశించారు. తరగతుల నిర్వహణకు అనుకూలంగా లేకపోతే ప్రత్యామ్నాయ భవన సదుపాయం ఏర్పాటును పరిశీలించాలని తెలిపారు. భవనాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో -2 నరేష్‌కుమార్ తెలిపారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి : మంత్రి



నూజివీడు/ఆగిరిపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆపత్కాలంలో ఉన్న నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. చాట్రాయి మండలం చనుబండ గ్రామానికి చెందిన బి. గోపీకృష్ణ కుటుంబానికి రూ.1.20 లక్షలు, ఆగిరిపల్లి మండలం, ఈదర గ్రామానికి చెందిన ఎం. పావని కుటుంబానికి రూ.6 లక్షలు ఎల్‌ఓసి పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఖరీదైన వైద్యం పొందాలంటే ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా సీఎం సహాయ నిధి నుంచి సీఎం చంద్రబాబునాయుడు వేల కోట్లు రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారన్నారు.

శోభనాపురం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



ఆగిరిపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా అన్నదాతలకు మేలు జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు అన్నారు. శనివారం శోభనాపురం సహకార సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చైర్మన్‌గా నలజాల హరిబాబు, సభ్యులుగా చక్కిరాల గోపీకృష్ణ, తిరుపతిరావు ప్రమాణ స్వీకారం చేశారు. టీడీపీ నేత నెరుసు సతీష్, నూతలపాటి నాగభూషణం, చిట్టినేని శివరామకృష్ణ, మడుపల్లి గోపాల్, చౌటుపల్లి విక్టర్‌బాబు, మాదాల బుజ్జి, పామర్తి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ 5న ఆందోళన

మునునూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. పార్టీ నూజివీడు నియోజకవర్గ కార్యవర్గ సమావేశం శనివారం మునునూరులో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తూ ప్రజలపై భారాన్ని మోపే ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తూ దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాలు ఆగస్టు 5న ఆందోళనలకు సిద్ధమవుతున్నామని తెలిపారు. నూజివీడు-ఏలూరు ప్రధాన రహదారి అభివృద్ధి చేయాలని, వాతావరణ పరిస్థితులు వల్ల నష్టపోయిన మామిడి రైతులకు రాపిడ్ ఇన్స్యూరెన్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

10.9 కేజీల వెండి ఆభరణాల బహూకరణ



కైకలూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): గోకర్ణపురంలోని గోకర్ణేశ్వర స్వామికి భక్తుడు 10.9 కేజీల వెండి జఠా ఝూటం, నాగాభరణాన్ని బహూకరించారు. శనివారం కైకలూరు మండలం గోకర్ణపురం గ్రామంలోని గోకర్ణేశ్వరస్వామికి శృంగవరప్పాడు గ్రామానికి చెందిన అంత్యం శోభానాద్రి, కనకదుర్గ దంపతులు వారి కుమారులు భార్గవసాయికుమార్, ఈశ్వరమణికంఠ స్వామివారికి బహూకరించారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి వెండి ఆభరణాలకు సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించి స్వామివారికి సుగంధద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వెండి ఆభరణాలను స్వామివారికి అలంకరించి పూజలు చేశారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ దాతలను ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శ్రీశ్యామలాంబ అమ్మవారికి శ్రావణ సారె



కైకలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారికి, ఆలయంలో కొలువైయున్న పార్వతీ సమేత రామ లింగేశ్వరస్వామికి శ్రావణ మాసోత్సవాల సందర్భంగా శనివారం కైకలూరు షిర్డిసాయి ధ్యానమందిరం కమిటీ సభ్యులు, మహిళా సేవకులు, భక్తులు సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అందజేశారు. ఐదేళ్లుగా ప్రతి శ్రావణమాస మహోత్సవాలకు సారెను అందజేస్తున్నారు. ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారికి సారెను అందజేసి పూజలు చేశారు.

ఉపాధ్యాయ వృత్తి ఆదర్శనీయం



అక్కినేని రాజశేఖర్ దంపతులకు సన్మానం

మునునూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శనీయమని ఎంఈవో సుబ్బారావు అన్నారు. మండలంలోని గుడిపాడు జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు అక్కినేని రాజశేఖర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈవో, గ్రామ ప్రముఖులు రాయంకుల లక్ష్మణరావు, కొల్లి గంగారామ్, ఎస్ఎంసీ చైర్మన్ మీరావలి, వైస్ చైర్మన్ మణి, హెచ్ఎం నాగబాబులతోపాటు యూటీఎఫ్ నాయకులు రాజశేఖర్, శైలజ దంపతులను ఘనంగా సన్మానించి, ఆయన సేవలను కొనియాడారు. అనంతరం రాజశేఖర్ దంపతులు విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242
నెక్ కోడి గుడ్డు ధర	(100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



చెక్ డ్యాం కొట్టుకుపోయింది

ఐదేళ్లుగా పట్టించుకోలేదు!

- తమ్మిలేరుపై వెంకటాపురం వద్ద 2020 వరదకు చెక్‌డ్యామ్ ధ్వంసం
- మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకెళ్లిన రైతులు
- నిర్మాణానికి హామీ
- మంజూరు కాని నిధులు



వెంకటాపురం వద్ద తమ్మిలేరులో కొట్టుపోయిన చెక్ డ్యామ్

మునునూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మునునూరు మండలం వెంకటాపురం వద్ద తమ్మిలేరుపై నిర్మించిన చెక్‌డ్యామ్ 2020లో వరదలకు కొట్టుకుపోయింది. ఐదేళ్ల నుంచి ఇప్పటి వరకు పట్టించుకున్న పాపాన పోలేదు. చెక్‌డ్యామ్ వల్ల బలివే, వెంకటాపురం, వేల్పుచర్ల గ్రామా ల పరిధిలో సుమారు 2వేల ఎకరాలకు సాగునీరు అందేది. గత ఏడాది చెక్‌డ్యామ్ నిర్మాణం చేపడతామని అన్ని రాజకీయ పార్టీలు హామీలు నీటి మూటలే. చెక్‌డ్యామ్ వల్ల పరిసర గ్రామాల్లో భూగర్భ జలనీటి మట్టం పెరుగుతుంది. తద్వారా వ్యవసాయ బోరుల్లో సైతం నీటి మట్టం పెరిగి ప్రజల వ్యవసాయ అవస రాలు తీరాయి. తొలుత 2009లో రూ.6 కోట్లతో చెక్ డ్యామ్ నిర్మించగా 2020 వరదలకు కొట్టుకుపోయింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం దీని వైపు కన్నెత్తి చూడలేదు. నాటి నుంచి పంటలకు సకాలంలో నీరు అందక రైతులకు తీవ్ర నష్టం జరిగింది.

నిధులు మంజూరు చేయండి..

2024 ఎన్నికల్లో నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి చెక్‌డ్యామ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారంలోకి రాగానే నిర్మిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఎన్నికల వేళ తాను ఇచ్చిన హామీని అమలు చేయడానికి మంత్రి సంబంధిత అధికారులను పంపి ప్రతిపాదనలు రూపొందించి సుమారు 8నెలలైంది. ఇంత వరకు చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి చెక్‌డ్యామ్‌ను నిర్మించాలని రైతులు కోరుతున్నారు. మంత్రి పార్థసారథి ఆదేశాలతో కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌ను పరిశీలించినట్లు నూజివీడు ఇరిగేషన్ డీఈ వై.అర్జునరావు తెలిపారు. చెక్ డ్యామ్ నిర్మాణానికి సుమారు రూ.3.5కోట్లు అవసరమని ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపామని, రాగానే పనులు చేపడతామన్నారు.

బీడువారిన భూములు



వేల్పుచర్లలో 7 చెరువులకు ఈ చెక్‌డ్యామ్ నుంచి సప్లైయి ఛానల్ ద్వారా చేరిన నీటితో పంటలు పండేవి. చెక్‌డ్యామ్ కొట్టుపోయిన నాటి నుంచి సుమారు 700 ఎకరాలు పంట పొలాలు బీడు భూములుగా మారాయి. ప్రభుత్వం చెక్‌డ్యామ్ నిర్మాణానికి చర్యలు చేపట్టి, రైతులకు మేలు చేయాలి

తుమ్మల నాగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు, వేల్పుచర్ల

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం రైతులకు శాపం



వైసీపీ హయాంలో వరదలకు చెక్‌డ్యామ్ కొట్టుపోయింది. ఐదేళ్ల నిర్లక్ష్య పాలన రైతులకు శాపంగా మారింది. ఈ చెక్ డ్యామ్ నుంచి సుమారు 700 ఎకరాల్లో పంట లు పుష్కలంగా పండేవి. ప్రస్తుతం వర్షాలపై అధార పడాల్సిన పరిస్థితి. ప్రభుత్వం చెక్‌డ్యామ్ నిర్మాణాన్ని చేపట్టాలి.

కాట్రు రామస్వామి, రైతు, బలివే

వరహాపట్నంలో పేలుడు

- భూమి నుంచి విస్ఫోటం
- ఇద్దరికి తీవ్ర గాయాలు, ఒకరికి వినికిడి సమస్య
- పేలుడు పదార్థం లేదని తేల్చిన బాంబ్ స్క్వాడ్



పేలుడు జరిగిన ప్రాంతంలో ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు..



పేలుడులో గాయపడిన సామగాని కార్తీక్

కైకలూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): జనసంచారంతో కిటకిటలాడే ప్రధాన సెంటర్‌లో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించడంతో ప్రజలు ఉలిక్కి పడ్డారు. కైకలూరు మండలం వరహాపట్నంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వరహాపట్నం నాలుగురోడ్ల కూడలిలో శనివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఓ బడ్డీకొట్టును ఆనుకుని పేలుడు సంభవించింది. ఆ విస్ఫోట నంతో అక్కడున్న యువకులకు తీవ్రగాయాలయ్యాయి. బడ్డీకొట్టును ఆనుకొని గతంలో బైక్ మెకానిక్ షాపు ఉండేది. అంతేగాక శుక్రవారం రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఎక్స్‌కవేటర్‌తో ఆ ప్రాంతంలో గోతులను తవ్వి సరిచేశారు. తవ్వకాల్లో జరిగిన ఒత్తిడి మేరకో మరెందుకో పేలుడు సంభవించింది. దీంతో గ్రామానికి చెందిన కోనాల నాని, సామగాని కార్తీక్ పేలుడు నుంచి వచ్చిన రాళ్లతో తీవ్ర గాయాలయ్యాయి. పడమటి శివగణేష్‌కు వినికిడి సమస్య తలెత్తింది. విషయం తెలుసుకున్న కైకలూరు రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గతంలో ఆ ప్రాంతంలో బైక్‌మెకానిక్ షాపు, బీఎస్ఎన్ఎల్‌కు చెందిన బాక్సులు ఉండేవని వాటిలో దేని నుంచో పేలుడు సంభవించినట్లుగా భావించారు. దీంతో బీఎస్ఎన్ఎల్, అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి బీఎస్ఎన్ఎల్‌కు సంబంధించిన పరికరాలేవీ లేవని నిర్ధారించారు. దీంతో ఏలూరు నుండి బాంబ్, డాగ్ స్క్వాడ్‌ను కైకలూరు రూరల్ సీఐ వి. రవికుమార్, రూరల్ ఎస్సై వి. రాంబాబు ఆధ్వర్యంలో తీసుకువచ్చారు. బాంబు పేలిన స్థలాన్ని పరిశీలించినప్పటికి పేలుడు పదార్థాలు ఉన్నట్లు నిర్ధారణ కాలేదు. దీంతో ఎక్స్‌కవేటర్‌తో ఆ ప్రాంతాన్ని నాలుగడుగుల మేర తవ్వకాలు చేసినప్పటికీ ఎలాంటి అవశేషాలు కనిపించలేదు. పేలుడు దేనివల్ల సంభవించిందో నిర్ధారణకు రాలేకపోయారు. అక్కడ మద్యం సీసాలు కొన్ని ఉండడంతో అవి ఒత్తిడికి పేలి ఉండవచ్చనే భావించారు. అయితే ఎలాంటి పేలుడు పదార్థాలు లేకపోవడంతో పోలీసులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.



కోరుకొల్లు లాకుల వద్ద తూడు, డెక్క తొలగింపు

కలిదిండి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు లాకుల వద్ద దట్టంగా పేరుకుపోయిన తూడు, డెక్కను శనివారం తొలగించారు. ఈ సందర్భంగా డీసీ చైర్మన్ పేటేటి సత్యనారాయణ మాట్లాడుతూ కోరుకొల్లు లాకుల వద్ద సీబీ కెనాల్‌లో తూడు, డెక్క పేరుకు పోవటంతో దిగువకు సాగు, తాగునీరు సక్రమంగా పారటం లేదన్నారు. తూడు, డెక్కను రైతులు సహకారంతో పూర్తిగా తొలగించి దిగువకు నీరు సరఫరా అయ్యే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

బీజేపీ సభ్యత్వాల నమోదులో కైకలూరు ద్వితీయం: కోటప్రోలు

ముదినేపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వాల నమోదులో రాష్ట్రంలో కైకలూరు నియోజకవర్గం రెండో స్థానంలో నిలిచిందని బీజేపీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు తెలిపారు. శనివారం పెయ్యేరు ఆటోనగర్‌లోని ముదినేపల్లి మండల బీజేపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ నాయకత్వంలో పార్టీ పటిష్టంగా రూపొందిందని తెలిపారు. నియోజకవర్గంలో 64 వేల సభ్యత్వాల నమోదు జరిగిందని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చిట్టూరి రవీంద్ర, నాయకులు మొవ్వ పణి, వత్తుమిల్లి ప్రసాద్, మీసాల సత్యనారాయణ, కె. నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ముదినేపల్లిలోని వికాస్ కళాశాలలో కార్గిల్ విజయ దివస్ నిర్వహించారు. కార్గిల్ అమర వీరులకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు తదితరులు నివాళులర్పించారు.



సైనికుడు డేవిడ్ రాజుకు సత్కారం



ట్రిపుల్ ఐటీలో కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

కలిదిండి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌లో కార్గిల్ విజయ దివస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న సైనికుడు డేవిడ్ రాజును ఉపాధ్యాయులు సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు అనిశెట్టి శ్రీనివాస్, జక్కుల విజయ్, ఉపాధ్యాయులు నున్న శ్రీనివాస్, డీవీ నాగేశ్వరరావు, లూయిస్, రాజేంద్ర ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: కార్గిల్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోగల నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఎన్‌సీసీ క్యాడెట్లు ర్యాలీ నిర్వహించారు. 17 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ సీహెచ్ఆర్ఎస్ఆర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ నిర్వహించగా అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ క్యాడెట్లు కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించారు.

మహర్దశ

(5వ పేజీ తరువాయి)

ఏడు ఎంఎల్‌డీ కెపాసిటీ గల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మిస్తున్నారు. ఎనిమిది రిజర్వాయర్లను ఏర్పాటు చేస్తారు. 98.81 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేస్తారు. నూతనంగా ఇంటింటికి ఆరు వేల కుళాయిలు వేస్తారు. నాగిరెడ్డిగూడెం రిజర్వాయర్ నుంచి తాగు నీరు సరఫరా చేస్తారు.

- నూజివీడుకు తాగునీటి కోసం రూ.13.87 కోట్లు కేటాయించారు. వీటిని పాడైన పైపులైన్ల మరమ్మతుల కోసం వినియోగిస్తారు. కొత్తగా నాలుగు వేలు ట్యాప్ కనెక్షన్లు ఇస్తారు.
- జంగారెడ్డిగూడేంకు తాగునీటి సరఫరా కోసం 101.16 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో 30 ఎంఎల్‌డీ కెపాసిటీ గల వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మిస్తారు. 45.43 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేస్తారు. నాలుగు రిజర్వాయర్లను నిర్మిస్తారు. కొత్తగా 9,486 కుళాయి కనెక్షన్లు ఇస్తారు.

డయాలసిస్.. కష్టాలు తీరాయి!

(5వ పేజీ తరువాయి)

కిడ్నీ బాధితులకు రూ.10 వేలు పెన్షన్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ పెన్షన్ మొత్తం ఒక్కొక్క రోగికి రూ.7 వేలు మాత్రమే అందేది.

రోగులు పెరిగితే మరిన్ని సౌకర్యాలు

కైకలూరు ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ కేంద్రంలో రోగుల సంఖ్య పెరిగితే డయాలసిస్ మెషీన్ల సంఖ్య పెరగనుంది. ఇప్పటికే ఉన్న ఐదు బెడ్లు, మిషన్ల ద్వారా రోగులకు రెండు దశల్లో డయాలసిస్ అందిస్తున్నం దున రోగుల సంఖ్య పెరిగితే మరో నాలుగు బెడ్లు, మిషన్లు ఏర్పాటు చేసేందుకు వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

పోక్సో కేసులో ముద్దాయిలపై రౌడీషీట్ : ఐజీ అశోక్‌కుమార్



మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్, పాల్గొన్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఉన్న ముద్దాయిలపై రౌడీషీట్లను ఓపెన్ చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏలూరు జిల్లా అర్థ సంవత్సర నేర సమీక్ష సమావేశాన్ని ఏలూరు జిల్లా పోలీస్ కార్యా లయంలో శనివారం జిల్లా ఎస్పీ కిశోర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రతి కేసు దర్యాప్తును డాక్యుమెంట్ల రూపంలో సేకరిం చాలని, ప్రాపర్టీని తరచుగా పరిశీలించా లన్నారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా సిబ్బంది దర్యాప్తులో నైపుణ్యాన్ని సంపాదించుకుంటూ చార్జిషీట్లను కోర్టులో ఫైల్ చేయాలన్నారు. డీఎస్పీలు తమ పరిధిలో ఉన్న కేసుల వివరాలు సేకరించి త్వరితగతిన దర్యా ప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేయడానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆదేశించారు. పోక్సో కేసులోని 60 రోజులలో దర్యాప్తు పూర్తి చేసి సంబంధిత కోర్టులో ఫైల్ చేయాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసి డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రత్యేక గస్తీని ఏర్పాటు చేశామని, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేసి ఆకతాయిలకు చెక్ పెట్టామన్నారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్ర రావు మాట్లాడుతూ జిల్లాలో గత సంవ త్సరంతో పోల్చుకుంటే 29 శాతం నేరాలు తగ్గాయని, జిల్లా ఎస్పీ కిశోర్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విధానం ప్రవేశపెట్టడం వల్ల ఈ ప్రగతి సాధించగలిగామన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి

బాల్య వివాహాలను అరికట్టండి

నూజివీడు టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతుంటే మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా చర్యలు చేపట్టవచ్చని నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద ఖాసిం అన్నారు. నూజివీడు బీసీ కళాశాల బాలికల వసతిగృహంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి పెద ఖాసిం ముఖ్య అతిథిగా మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమని, మేజర్లు అవ్వకుండా వివాహాలు చేస్తే కఠిన చర్యలు చేపట్టాల్సి వస్తుందన్నారు. ఎవరైనా అలా చేస్తున్నట్లు తెలిస్తే సంబంధిత విషయాన్ని మహిళ శిశు సంక్షేమశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మన్నెం రమేష్, సీనియర్ న్యాయవాదులు ఎస్‌కేడీ ప్రసాద్, గోపీనాథ్, రామారావు, జానకీరామ్, వార్డెన్ ఎస్. మాధురి కృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు కంప్యూటర్ల వితరణ

ముదినేపల్లి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత గ్రంథాలయాల్లో ఆధునిక శాస్త్ర సాంకేతి కతను పెంపొందించేందుకు బెంగుళూరు శివశ్రీ చారిటబుల్ ట్రస్టు, శిక్షణ ఫౌండేషన్ సంయుక్తంగా కృషిచేస్తున్నాయి. ఇందులో భాగంగా కైకలూరు నియోజకవర్గంలోని ముదినేపల్లి, కోరుకొల్లు, మండ వల్లి, కైకలూరు శాఖా గ్రంథాలయాలకు కంప్యూటర్లు, టీవీలు, స్మార్ట్‌ఫోన్లు ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం మచిలీపట్నం లోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయం లో సంస్థ కార్యదర్శి వి. రవి కుమార్, ప్రాజెక్టు మేనేజర్ వి. సాత్వి దేవ్, శాఖా గ్రంథాల యాల లైబ్రేరి యన్లకు అందజేశారు. డిజిటల్ లైబ్రరీ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా ప్రతి శాఖా గ్రంథా లయా నికి రెండు కంప్యూటర్లు, ఒక స్మార్ట్ టీవి, ఒక స్మార్ట్ ఫోన్, ఉచిత ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పి స్తున్నాయి. ఉప గ్రంథాల యాధికారి బీరం వెంకట రమణ, గ్రంథాల యాధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

మండవల్లి జూలై 26(ఆంధ్రజ్యోతి): మంచి జ్ఞానం, అనుభవం గల ఉపాధ్యాయుల బోధనలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అంగలూరు డైట్ కళాశాల బయోలాజికల్ సైన్స్ లెక్చరర్ పి శివపార్వతి పేర్కొన్నారు. మండలంలోని లోకుమూడి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశా లలను మరింత బలోపేతం చేయాలని, దీనికి ఉపాధ్యాయులు కృషితో పాటు విద్యార్థులు, తల్లిదండ్రు లు తోడ్పాటు ఎంతో అవసరమన్నారు. ప్రధానో పాధ్యాయుడు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన అవగాహన సదస్సు

నూజివీడు టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీ పరిధిలో గల నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో సీఎస్ఈ విభాగానికి సంబంధించి మూడు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. సాక్ ఆడిటోరియంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫోర్సును వేగవంతం చేయడానికి ఉపయోగించే ఎమ్మెస్ - 4004 మైక్రోసాఫ్ట్ 365 అనే కోర్సులను ప్రవేశపెట్టారు. ఇందుకు సంబంధించిన శిక్షణ కార్యక్రమం తదితర అంశాలపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ట్రైనర్ అన్సారీ పలు సాంకేతిక అంశాలను వివరించగా ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్. అమరేంద్రకుమార్, సెంట్రల్ డీన్ డి. శ్రావణి, అకడమిక్ డీన్ ఎస్. చిరంజీవి, ఏవో లక్ష్మణరావు, హెచ్‌ఓడి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

నూజివీడు టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు చేపట్టారు. ఇందులో భాగంగా 14వ వార్డు పరిధిలో గల కృష్ణారెడ్డి కాలనీ, శ్రీనగర్ కాలనీలో దోమల నివారణకు మందు పిచికారీ, పారిశుద్ధ్య మెరుగు చర్యలను శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు.

డ్రైయినేజీల్లో పూడిక తొలగింపు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి పంచాయితీ పరిధిలోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపును శనివారం ఈఓపీఆర్డీ ఆనంద్‌బాబు పర్యవేక్షణలో సర్పంచ్ చౌటుపల్లి లక్ష్మీవిక్టర్ బాబు ఆధ్వర్యంలో చేపట్టారు. పరిశుద్ధ్య పనుల్లో భాగంగా శోభనాపురం రోడ్‌లో మురుగు కాలువలో చెత్తను పేరుకుపోయిన మట్టిని ఎక్స్‌వేటర్‌తో తీసి శుభ్రపరిచారు. పాఠశాల రోడ్‌లో పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీల్లోని చెత్త తొలగించారు.

కడుపునొప్పి తాళలేక వృద్ధుడి ఆత్మహత్య

మునునూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కడుపు నొప్పి తాళలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని గోగులంపాడు కొత్తూరుకు చెందిన చెన్ను గురునాథం (65) నాలుగు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతూ మందులు వాడుతున్నాడు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం తట్టుకోలేనంతగా నొప్పి రావడంతో ఇంటిలో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వెంటనే కుటుంబీకులు అతనిని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.